యువ: మే 1981

# కల చెదిరింది

సుచిత్రకు రెండెడ్ల బండిలో ప్రయాణమన్నా, పల్లెటూరు వెళ్ళి వుండాలన్నా ఎలర్జీ, ఏవగింపూనూ. కానీ ఈసారి తప్పలేదు. మోహన్ బలవంతం మీద అయిష్టంగానే బయలు దేరింది పాపతో. రెండు రోజులు రైల్లో ప్రయాణం చేసి ఆ తర్వాత బస్సులో పడి, నానా ఇబ్బందులతో, రెండెడ్ల బండి ఎక్కేసరికి సాయంత్రం అయింది. సూర్యుడు పడమటి కొండల వెనక్కు జారిపోతున్నాడు.

గూడుబండిలో క్రింద గడ్డి పరిచి, పైన జంబుఖానా వేసి, రోడ్డు దిగి, పొలాల మధ్య లోంచి, ఎగుడు దిగుడు కందకాలు, డొంకల మధ్యలోంచి, ఎద్దులు పరుగులు తీస్తుంటే, పుట్టిందగ్గర్నుంచీ పల్లెటూరు ప్రయాణం చెయ్యని మోహన్‌కు, బేబీకి చాలా సరదాగా వుంది. సుచిత్రకు మాత్రం బండి కుదుపుకు వళ్ళంతా పులిసినట్లయి, కొంచెం జ్వరం కూడా వచ్చింది.

ఊళ్ళోకెళ్ళి బండి దిగేసరికి, తదియ చంద్రుడు నీలాకాశంలోకి ఆడుకునేందుకు వచ్చాడు.

భాస్కరం ఇంట్లో లేడు. అతని భార్య పద్మ సుచిత్రనూ, మోహన్నూ పలకరించి, బేబీని ఎత్తుకుని ఇంట్లోకి తీసుకెళ్ళింది.

వేపచెట్టు గాలి అహ్లాదంతో గిలిగింతలు పెడుతుంటే మోహన్ ఆరుబయట కుర్చీలో పడుకున్నాడు. సుచిత్ర వరండాలో నవారు మంచం మీద ముసుగెట్టి పడుకుంది మూలు గుతూ.

బేబీకి పెంకుటిల్లూ, దొడ్లో కొబ్బరి చెట్లూ, బుజ్జాయి, ఆవులూ, గేదెలూ, దొడ్లో బావి అన్నీ క్రొత్తగా, వింతగా తోచాయి. పద్మను 'అత్తా' అని పిలుస్తూ ఆమె వెంబటే తిరగసాగింది.

ఆ రాత్రి భాస్కరం వచ్చేసరికి, మోహన్ స్నానం చేసి, కాఫీ త్రాగి, సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ, ఆకాశాన్నీ, ఆ ప్రక్కనే గొడ్లసావిట్లో వున్న పాడిగేదెనూ, ఎద్దులనూ, ధాన్యపు పురినీ చూస్తూ, రెండు నెలలు మంచి కాలక్షేపం అనుకుంటున్నాడు.

భాస్కరం వస్తూనే, "సారీ! బస్సు దగ్గరకు రాలేకపొయ్యా. ఇవ్వాళే ధాన్యం కొట్టిస్తున్నా!" అని సంజాయిషీ చెప్పుకుని, "ప్రయాణం బాగా జరిగిందా?" అని పరామర్శించాడు.

మోహన్‌కు భాస్కరానికి యిదే తొలి పరిచయం కాదు.

భాస్కరం సుచిత్ర దగ్గరికెళ్ళి, "ఏం పడుకున్నావ్?" అనడిగాడు.

"కొంచెం జ్వరం వచ్చింది" - మోహన్ సమాధానం చెప్పాడు.

భాస్కరం నవ్వి, "అన్నగారూ! యిది మొదట నుంచీ యింతేలెండి. ఎండకూ వానకే గాదు, కొంచెం శ్రమకూ తట్టుకోలేదు" అన్నాడు.

భాస్కరం, సుచిత్ర మేనమామ, మేనత్త బిడ్డలు.

మోహన్‌కు పద్మ వంట నచ్చింది. అంతేగాక, కమ్మని రుచికరమైన కూరలూ, గడ్డ పెరుగూ, అన్నీ జీవితంలో ప్రథమంగా తినటమేమో, స్వర్గంలో కాలు పెట్టినట్లు అనిపించింది.

ఆ మాటే భాస్కరంతో అన్నాడు గూడ! భాస్కరం నవ్వి, "అన్నగారూ! పల్లెలు స్వర్గసీమ లేం గాదు. ఇక్కడున్న కష్టాలిక్కడావున్నాయి!" అన్నాడు.

ఆ రాత్రి ప్రొద్దుపొయ్యేంతవరకూ భాస్కరం, మోహన్ కబుర్లాడుకుంటూనే వున్నారు.

సుచిత్రకు మర్రోజుకు జ్వరం తగ్గింది. అసలే బలహీనంగా వున్న సుచిత్ర మరీ డీలా పడిపోయింది. ముక్కుతూ మూలుగుతూనే స్నానం చేసి, మళ్ళీ మంచం ఎక్కింది.

బేబీ, తల్లి ధ్యాసే వదలి, పద్మ వెంటే వుండి కబుర్లు చెబుతూ తెల్లారినదగ్గర నుంచీ గేదెకు పాలు తీస్తున్నా, పెరుగు చిలుకుతున్నా అంతా ఆశ్చర్యంగా చూస్తూ, ప్రశ్నలు వేస్తూ వుంది.

భాస్కరం మోహన్‌ను తీసుకు పొలానికి వెళ్ళాడు. అక్కడే పందుంపుల్లతో ముహం కడుక్కుని, బావి దగ్గర స్నానం చేసి గుడ్డలారేసుకుని, బారెడు ప్రొద్దెక్కేసరికి ఇద్దరూ ఇంటి కొచ్చారు.

"ఏమిటీ అవతారం?" అంది సుచిత్ర మోహన్ను చూస్తూనే.

"ఇక్కడ ఇలాగే వుండాలి!" భాస్కరం జవాబుకు సుచిత్ర మాట్లాడలేదు.

"సుచీ! బావిదగ్గర స్నానం చేస్తే ఎంత హాయిగా వుందో. నువ్వు రాలేదుగానీ, తెల్లారు ఝామున పొలాల్లో కెడితే, ఎంత నిశ్శబ్దం. ప్రశాంతత! అసలు కొబ్బరి చెట్లలోంచి వచ్చే సూర్యుడు, పక్షులు చేసే కిలకిలా రావాలు! వండ్రఫుల్! చిన్నప్పుడెప్పుడో చదివిన వర్డ్స్‌వర్త్ పద్యాలు గుర్తొచ్చాయి! ఆహా! నాకైతే సుచీ, మళ్ళీ ఢిల్లీ వెళ్ళాలంటే బాధగా వుందనుకో!" అని మోహన్ చెబుతుంటే, సుచిత్రకు వంటి మీద గొంగళి పురుగు ప్రాకినట్లు వుంది.

అల్లం, పచ్చిమిరపకాయలు వేసిన పెసరట్లు, కొబ్బరి పచ్చడిలో అద్దుకుని, వెన్నపూస రాసుకుని తింటుంటే, మోహన్‌కు విపరీతమైన ఆకలేసింది. జన్మజన్మల నుంచీ ఆకలిగొన్నవాడిలా, వేసిన పెసరట్లు తినేసి, సుచిత్రను గూడ తినమని బలవంతపెట్టాడు.

సుచిత్రకు మోహన్ వాపితనం చూస్తుంటే, అరికాలిమంట నెత్తి కొచ్చింది. కాఫీలవ్వీ త్రాగాక వంటరిగా మోహన్ను పిలిచి, "మీరు మరీ సిగ్గూ బిడియం వదిలేశారు!" అని కోప్పడ్డది.

"ఏమయిందిప్పుడు?"

"లేకపోతే, పెసరట్ల మొహం చూడనట్లు బకాసురుడిలా ఏమిటా తిండి. పైగా లొట్టలేసుకుంటూ - నో! నో! ఇలా అయితే వెడదాం ఇక్కణ్ణుంచి!" అంది సుచిత్ర.

మోహన్ ఢిల్లీ కేంద్ర సచివాలయంలో ఆఫీసరు. అలాంటివాడు, ఈ పల్లెటూళ్లో, తిండికి మొహంవాచినట్లు ప్రవర్తించడం సుచిత్రకు నచ్చలేదు. పైగా, భాస్కరం చూసి ఏమనుకుంటాడు?

"సుచీ! హిపోక్రసీ వదిలెయ్యి. నేనెంత ఆఫీసర్నయినా మనిషినే! అయినా వీళ్లు పరాయివాళ్లూ, యిదేం పరాయి చోటూ గాదుగా! నీవేమన్నా అనుకో. నీలా అంటీముట్ట నట్లు నేనుండలేను" అని మోహన్ చెప్పేశాడు సుచిత్రకు.

సుచిత్ర, తనొక్కతెను బందీ చేసి, ఈ మారుమూల వూళ్ళో బంధించినట్లుగా భావించు కుంటున్నది. వచ్చినప్పట్నుంచీ బేబీకి తనక్కరలేకపోయింది. మోహన్ జీవిత ఖైదు నుంచి విడిపించుకువచ్చినవాడిలా తిరగసాగాడు. సందడి లేదు. ఎవరితోనైనా మాట్లాడదామంటే సుచిత్రకు నామోషి. అందుకనే పగలంతా గదిలోనూ, వరండాలోనూ, మంచం మీద పడుకునో, కూర్చునో కాలక్షేపం చేసింది.

పద్మ పగలంతా పనిచేస్తున్నా ఎక్కడా అలసినట్లు కనబడేది గాదు. పైగా ఆమె ప్రతి పనీ చాలా నెమ్మదిగా, అందంగా కూడ చేసేది. ఎప్పుడూ నవ్వుతూ వుండే పద్మను చూస్తుంటే సుచిత్రకు మరీ బాధగా ఉండేది. పల్లెటూళ్ళో జనం మడ్డి మనుషులనీ, అనాగరికంగా వుంటారనీ, సుచిత్ర నమ్మకం. ఆ నమ్మకం పద్మను చూడగానే పటాపంచ లైంది. అప్పుడే చెట్టు నుండి తెంపి తెచ్చిన బొండుమల్లెలా ఉంటుంది పద్మ. అంతేగాదు, మామూలు నేతచీర కట్టుకున్నా, పద్మ అందంగానే కనిపించేది సుచిత్రకు. అంతేగాక, కష్టాలు, ఇబ్బందులు లేనట్లుగా గూడ కనిపించేది పద్మ.

వచ్చిన రెండో రోజు, పద్మ వచ్చి, "అక్కా! పేరంటానికి వెళ్దాం వస్తావా?" అనడిగింది.

సుచిత్ర అవుననీ కాదనీ అనలేదు.

సాయంత్రం పద్మ బేబీని తీసుకువెడుతుంటే, సుచిత్ర ప్రాణం గువగువ లాడింది. మరి రెన్నాళ్ళు అశ్రద్ధ చేస్తే బేబీ తనను మర్చిపోతుందేమో?

"నేనూ వస్తా!" అని సుచిత్ర బయలుదేరింది.

కంకర రోడ్డు చక్కగా, నల్లని కురుల మధ్య పాపిటలా ఉంది. ఎక్కువ భాగం పెంకుటిళ్లే అయినా, వున్న ఇళ్ళు శుచిగా, శుభ్రంగా వున్నాయి. ప్రతి ముంగిట అరుగులు, దానిపై కూర్చుని తాపీగా కబుర్లు చెప్పుకునే జనం. వీధిలో కరెంటు దీపాలు. ఒకటి

రెండు చోట్ల బోరింగు పంపులు. పైగా వీధిలో పోయినంత దూరం రేడియో వినపడుతూనే వుంది.

"వూరంతా యింత బాగుంటుందా?" - సుచిత్ర ప్రశ్నకు పద్మ చిన్నగా నవ్వి, "ఏం అక్కా మా వూరు బాగుందా నీకు" అనడిగింది.

సుచిత్ర సమాధానం చెప్పలేదు.

పేరంటానికి వెళ్లినచోట, సుచిత్రను మర్యాద చేసి, ప్రత్యేకంగా కుర్చీ వేసి కూర్చో బెట్టారు. వచ్చిన ముత్తయిదువలు చాపల మీద కూర్చున్నారు. అలా తనకో ప్రత్యేకత, గౌరవం లభ్యమయ్యేసరికి సుచిత్ర మొహం విప్పారింది.

ఆ యింటివారి మనవడిని తొట్టిలో వేస్తున్నారారోజు. పసుపు, గంధం వ్రాసి తాంబూలాలిచ్చి, పిల్లవాడిని తొట్లో వేశారు. ఇద్దరు ముత్తయిదువలు లాలి పాటలు పాడారు.

అంత వయసొచ్చిన ఆడవాళ్ళు రాచుకుపోయిన గొంతులతో పాటలు పాడడం సుచిత్రకు చాలా వింతగా వుంది. ఆ పాటల్లో అర్థమూ, శ్రావ్యతా వున్నా సుచిత్రకు నచ్చలేదు. బావిలో కప్పలు అని తీర్మానించుకుంది. ఆఖరున పద్మ పాట పాడింది. ఏదో భావగీతం!

సన్నని గొంతుతో, వీణలు మీటినట్లు, కిన్నెరలు గానం చేసినట్లు, పిల్ల తెమ్మెరలు వీచినట్లు, పండు వెన్నెల రాత్రి చిరుగాలికి దేవాలయపు ధ్వజస్తంభపు చిరుగంటలు మ్రోగినట్లు... పద్మ పాట పాడింది. అలా సుచిత్రకు తోచింది. ఆ పాట వింటుంటే, సుచిత్ర హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఎన్నాళ్ళ క్రితమో కాలేజీ విద్యార్థినులతో విహారయాత్రకు వెళ్ళినప్పుడు, ఓ నల్లటి పిల్ల, సముద్రపు వొడ్డున కూర్చుని, నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ప్రపంచాన్ని సంగీతామృతంతో ముంచెత్తగా సుచిత్ర విన్నది. ఆ పాట, ఆ పాటలోని శ్రావ్యత, భావం సుచిత్ర కింకా గుర్తే.

కోరిన వాడి కౌగిలిలో తొలిసారి పొందిన అనుభవం, మాతృత్వం వహించిన తొలినాడు, బేబీ చిరుచేతులతో తొలిసారి తాకినప్పుడు కలిగిన అనుభూతి గుర్తుకొచ్చాయి సుచిత్రకు, పద్మ పాట విన్నాక.

పేరంటం అయి ఇంటికొచ్చేటప్పుడు మనస్సులోని భావాన్ని దాచుకోలేక పద్మ దగ్గిరగా వెళ్ళి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లగా నొక్కి, "చాలా బాగా పాడావు" అని అన్నది సుచిత్ర.

పద్మ చిన్నగా నవ్వి, "ఏదో పల్లెటూరి పాట! నీకు నచ్చిందంటే విశేషమే!" అంది బిడియపడుతూ.

ఆ రాత్రి భోజనాలయ్యాక మోహన్ దగ్గరికెళ్ళి, "పద్మ చాలా బాగా పాడుతుంది!" అని చెప్పింది.

మోహన్ కళ్ళింత చేసుకుని, "ఐ.సీ.సుచీ! నువ్వు మెచ్చుకున్నావంటే సామాన్యమేం

గాదు. అయితే రేపు నేనూ వింటాను" అన్నాడు.

"అంతటి కమ్మని గొంతు వుండటం ఎంత అదృష్టమో! ఇలా పల్లెటూళ్ళో రాటయి పోతోంది గానీ, ఏ మద్రాసో వెళ్ళి ఓ సారి పాడితే, సినిమా వాళ్ళు ఎగరవేసుకుపోతారు"

"అందుకే మీ తమ్ముడు భద్రంగా, వూళ్ళోనే వుంచేసుకున్నాడేమో!"

ఆ తర్వాత సుచిత్ర మాట్లాడలేదు. ఆమెకు మోహన్ మాటల్లో నిజమెంతో, ఎద్దేవా ఎంతో తెలియలేదు.

పద్మ, భాస్కరంతో అంది, "మా మరదలు, పైకలా రిజర్వ్‌డ్‌గా వున్నట్లు కనిపిస్తుంది గానీ వట్టి భోళామనిషి"అని!

"అది మొదట్నుంచీ దొరసాని పిల్ల. అలాగే పెరిగింది. కోరుకున్నట్లే మంచి మొగుడు దొరికాడు! మోహన్ చాలా కలుపుగోరుతనం వున్నవాడు" అన్నాడు భాస్కరం.

"అవునూ! సుచిత్రను మీ రెందుకు చేసుకోలేదూ!" పద్మ ప్రశ్నించింది.

పద్మకీ అనుమానం చాలా రోజులుగా వుంది. ఆస్తీ, అందం, చదువూ వున్న భాస్కరాన్ని కాదని సుచిత్ర ఎందుకందీ!

"పద్మా! సుచిత్ర అదోరకం. పైగా దానికీ పెళ్ళి ఇష్టం లేదు. కాదూ గూడదంటే పప్పుకునేదేమో గానీ, నేనే వద్దని చెప్పేశాను."

"పొరపాటుచేశారేమో?"

భాస్కరం పద్మను దగ్గరకు లాక్కుని, "మైడియర్ పద్మా, నిన్ను చూశాను, చేసుకున్నాక నా తప్పు లేదనిపించింది. పైగా మోహన్ ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?" పద్మ గుండెలు గుబగబలాడాయి.

"తమ్ముడూ! మా ఆవిడ సుచీ వుందే, నగిషీ చెక్కిన గాజుబొమ్మ."

"ఊ...!! యింకా?"

"యింకా ఏమన్నాడంటే... మా మరదలు పద్మ... అజంతా సుందరి. పాలరాతితో వెలిసిన దివ్యసుందరి!"

పద్మ మురిసిపోయింది. సిగ్గుతో మొగ్గయి, భాస్కరం కౌగిట్లో కరిగిపోయింది.

:: 2 ::

సుచిత్ర, మోహన్ వచ్చి పదిహేను రోజులయింది. ఇన్నాళ్ళూ, సుచిత్ర మంచం దిగ లేదు. మహారాణీలా కూర్చుని, సుచిత్ర అపసోపాలు పడుతుంటే మోహన్ చూస్తూ వూరు కోలేక,

"సుచీ! నువ్వూ లేచివెళ్ళి, పద్మకు సాయం చెయ్యరాదూ!" అని అన్నాడు."

"నేను ఆరోగ్యం బాగోలేక వచ్చాను. తిని కూర్చోటానికి రాలేదు!"

"అయితే మాత్రం, కాస్త లేచి తిరుగు. పనీపాటా చెయ్యి!"

"మీ కంటికి నేను బలిసివున్నట్లు కనబడుతున్నానా!" సుచిత్రకు కోపం వచ్చింది.

మోహన్ ఏదో అనబొయ్యేంతలో పద్మ లోపలకు వచ్చింది.

"పద్మా! మేం రేపు వూరెడతాం!" అంది సుచిత్ర కిటికీలోంచి బయటకు చూస్తూ.

"వచ్చి నాలుగు రోజులు కాలేదు అప్పుడే వెడతారా?"

"మీ యింట్లో పడి తినటం ఏం బావుంటుంది!"

సుచిత్ర మాటకు మోహన్ షాక్ తిన్నాడు! పద్మ క్షణం విస్తుపోయి సుచిత్రను చూసి తలొంచుకుని, "చెల్లమ్మా యిది నీ ఇల్లే! అన్నీ సవ్యంగా వుంటే నా స్థానంలో నువ్వుండా ల్సినదానివి!" అని వెళ్ళిపోయింది.

"ఆ అమ్మాయి ఎంత బాధపడిందో! ఆలోచించకుండా, నోటికొచ్చినట్లు మాట్లాడడమే!" మోహన్ విసుక్కున్నాడు.

"నేను పల్లెటూరి బొందను. చదువు రాదు. అందుకే అసభ్యంగా మాట్లాడాను. క్షమించండి," సుచిత్ర మంచం మీద పడుకుంది గోడ వేపు తిరిగి.

ఆ మాటలు పద్మ నుద్దేశించే అన్నదని మోహన్ గుర్తించాడు. సుచిత్ర ప్రవర్తనకు కోపమూ వచ్చింది.

"పద్మ నీకంటే ఎక్కువే చదువుకుంది. ఆ సంగతి తెలియదేమో! యం.ఎ. లిటరేచరు. సంగీతంలో డిప్లమా కూడా వుంది. పల్లెటూళ్ళో వున్నంత మాత్రాన అనాగరికురాలేం కాదు. పట్నాల్లో వుంటూ, నాగరికులమన్న భ్రమలో నువ్వు ఉన్నావ్?"

మోహన్ వెళ్ళాక, అతడన్న మాటలే చెవులో గింగురుమన్నాయి సుచిత్రకు.

క్షణకాలం అతని మాటలు నమ్మబుద్ధి కాలేదు. పద్మ యం.ఏ? నిజమా కాదా అన్న సందిగ్ధత కలిగింది. ఎందుకంటే -

పద్మ తొలికోడి కూసినప్పుడే లేచి, తలారా స్నానం చేసి, పట్టుచీర కట్టుకుని, తులసి కోట దగ్గర కూర్చుని సూర్యోదయం వరకు పూజలు చేస్తుంది. ఆ తర్వాత పాలు పితికి, దాలి పొయ్యి మీద పడేసి, పెరుగు చిలికి వెన్నపూస తీస్తుంది. వాకిళ్ళు పూడ్చటం, కళాపి చల్లి ముగ్గు లెయ్యటం, అన్నీ స్వయంగా చేస్తుంది పద్మ. వంట వార్పులు గూడ, పాతికేళ్ళ అనుభవం వున్న అరిందాలా చేస్తుంది. తెల్లారిందగ్గర్నుంచీ రాత్రి వరకూ క్షణం విరామం లేకుండా పనిచేసే పద్మ, పోస్ట్ గ్రాడ్యుయేటా?

సుచిత్రకు నమ్మబుద్ధి కాలేదు. పద్మను అడగటానికి బిడియపడ్డది. వీలు చూసుకుని భాస్కరాన్నే అడిగింది.

"ఏం బావా! మీ ఆవిడ పోస్ట్ గ్రాడ్యుయేటా?" అని.

భాస్కరం నవ్వి, "నీకెవరు చెప్పారూ?" అడిగాడు.

"అయితే, నా మీద కోపంతో నా కన్నా ఎక్కువ చదువుకున్నదాన్నే చేసుకున్నావన్న మాట!"

భాస్కరం సుచిత్ర మాటలకు విస్తుపోయాడు.

"సుచిత్రా! నీ మీద నా కెందుకూ కోపం?"

"ఎందుకా, నిన్ను కాదని వేరేవాడిని చేసుకున్నందుకు!"

"నాక్కోపం అని నీకు చెప్పానా!"

"మరయితే, పద్మ చదువుకుందని నా కెందుకు చెప్పలేదు!"

సుచిత్ర విషయం, స్వభావం తెల్సిన భాస్కరం తలొంచుకుని మొహంలోని భావం వ్యక్తం గాకుండా, "పొరపాటే సుచిత్రా!" అన్నాడు.

సుచిత్రకు పద్మంటే అభిమానం ఏర్పడ్డది. ఆమె చదువుకున్నదని తెలిశాక సానుభూతీ కలిగింది. అంత చదువుకుని, పల్లెటూళ్ళో గొడ్ల మధ్య, మట్టి మనుషుల్లో పడి బ్రతుకుతున్నందుకు.

"మీరు 'యమ్మే' చదివారుటగా!"

పద్మ నవ్వి, "అదిగో, వద్దన్నా వినకుండా మీ బావ ఆ డిగ్రీ గోడకు తగిలించారు. అయినా యిక్కడకొచ్చాక చదువు సంగతే మర్చిపోయాను" అంది.

సుచిత్రకు జాలి వేసింది.

"హాయిగా ఏ ఉద్యోగస్తుడినో చేసుకోవాల్సింది. మీరూ, అతనూ హాయిగా ఉద్యోగాలు చేసుకుంటూ సుఖంగా వుండేవారు."

"నేనిప్పుడు కష్టపడుతున్నానంటారా?"

ఆ ప్రశ్న సుచిత్రకు నచ్చలేదు.

"నాకు తెలుసు. మా బావ మొండివాడు. తను సుఖపడలేడు. కట్టుకున్న వాళ్ళనూ సుఖపెట్టలేడు. హాయిగా ఉద్యోగం చేసుకోక, ఈ దుమ్ము ధూళిలో ఎందుకు చెప్పండి. అతగాడు చెడింది చాలక, మిమ్మల్ని తెచ్చి, ఈ రొంపిలో పడేశాడు!" అంది సుచిత్ర.

"నేను కావాలనే మీ బావను పెళ్ళి చేసుకున్నాను. నా బలవంతం మీదనే, వచ్చిన ఉద్యోగం కూడా వదులుకొని ఇక్కడ వున్నారు," అని పద్మ చెప్పేసరికి సుచిత్ర విస్తుపోయింది. విచిత్రంగా పద్మను చూసి, 'అంత చదువుకున్న పద్మకు ఇంత చాదస్తం ఎలా అబ్బిందా?' అని ఆశ్చర్యపోయింది.

"మరి యమ్మే దాకా ఎందుకు చదివినట్లు?"

పద్మ చేస్తున్న పని ఆపి, సుచిత్ర ప్రక్కన కూర్చుని, "నే చదివింది ఉద్యోగం చెయ్యాలని కాదు సుచిత్రా" అంది.

"మరి దేనికి?"

"చదువుకున్నవాళ్ళంతా ఉద్యోగాలు చెయ్యాలన్న నిబంధన ఏం లేదు గదా! అలా వున్నా అందరికీ ఉద్యోగాలూ దొరకవు."

సుచిత్ర మాట్లాడలేదు. పద్మనే వింతమనిషిగా చూస్తూ వుండిపోయింది.

"అవును సుచిత్రా! నీ దృక్పథంలో నేను పిచ్చిదాన్ని కావచ్చు! కానీ, నే చదువుకుంది

నా కోసం. నా సంసారం కోసం. అంతే! మీ బావకు పొలముంది. దగ్గరుండి పండించు కుంటే, మేమిద్దరం కలిసి ఉద్యోగాలు చేసి సంపాయించే దానికన్నా ఎక్కువే ఆదాయం వస్తుంది. అది చాలు!"

పద్మ చెప్పిన జవాబుకు, సుచిత్ర మరి మాట్లాడలేకపోయింది. బావిలో కప్పలా బ్రతికే పద్మ మనస్తత్వం సుచిత్రకు నచ్చలేదు. ఈ కలియుగంలో ఇలాంటి స్త్రీలూ వున్నారంటే సుచిత్రకు నమ్మక తప్పలేదు.

భాస్కరాన్ని తనెందుకు పెళ్లి చేసుకోలేదూ?...

సుచిత్ర తండ్రి విశ్వనాథం, చిన్నప్పుడే బర్మా వెళ్లి, అక్కడ నానా తిప్పలూ పడి సంపాయించి, ఇల్లూ ఆస్తీ ఏర్పరచుకున్నాడు. ఆ తర్వాత ఇండియా వచ్చి కులమింటి కన్యను వివాహమాడాడు. బర్మాలో పెళ్లాం, పిల్లలతో స్థిరపడదామనుకునేంతలో, భారతీయులందర్నీ స్వదేశం పంపేసింది అక్కడి ప్రభుత్వం.

ఇండియా వచ్చాక, నలభైయ్యేళ్ళ శ్రమకు ఫలితంగా, ప్రభుత్వం ఇచ్చిన కొద్దిపాటి పరిహారంతో జిల్లా కేంద్రంలో ఫ్యాన్సీ షాప్ పెట్టుకున్నాడు. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేసేసరికి ఆస్థి, ఆదాయం తగ్గిపోయాయి. భార్య గతించింది. విశ్వనాథంగారికీ వయస్సు పైబడ్డది. గారాబంగా పెరిగిన సుచిత్ర ఊహ తెలిశాక ఇండియా రావటమూ, ఇక్కడి వాతావరణం, భాష, ఆచార వ్యవహారాలు నచ్చక, కాన్వెంటు చదువుతో పూర్తిగా శాపవశాన బ్రిటన్, అమెరికా లాంటి దేశాల్లో ధనిక వర్గాల ఇంట పుట్టాల్సింది తప్పిపోయి, ఇండియాలో పుట్టినట్టుగా ప్రవర్తించటం అలవాటు చేసుకుంది. తండ్రి ఏడ్చి మొత్తుకున్నా, మేనత్త కొడుకు భాస్కరాన్ని చేసుకునేందుకు ఒప్పుకోలేదు. తండ్రి చనిపొయ్యేప్పుడు-

"సుచిత్రా! నేను పుట్టిన పుణ్యభూమిని వదులుకుని, దూరతీరాలకు వెళ్లి నిరాశతో వచ్చాను. నే తిరిగి వచ్చేసరికి ఏముంది? బంధువులు లేరు. వున్నవాళ్ళు నాతో బంధాలు, బంధుత్వాలు తెంపుకున్నారు. నే పుట్టిన చోటే పరాయివాడి నయ్యాను. కాందిశీకుడి నయ్యాను. 'అన్నయ్యా' అని పిల్చి, ఆదరించి మా చెల్లెలు, నాకు తోడునీడగా వుంది. దాని ఒక్కగానొక్క కొడుకు, నే వెళ్లి, 'అమ్మాయి, నా కూతుర్ని నీ యింట్లో ఉంచుకోమ్మా' అనడిగితే, 'అన్నయ్యా! అదెంత భాగ్యంరా! సుచిత్ర నా కోడలేరా!' అనంది. మమకారం, బంధుప్రీతి, కుటుంబాల మధ్య సయోధ్య - ఇవి మనకొచ్చిన సంపద తల్లీ! ఇక్కడ దరిద్రుడైనా తల్లీ, తండ్రిని పోషిస్తూ, తల్లి తోడును ప్రేమగా చూస్తాడు. ఆస్తులు - అంతస్తులకన్నా, అంతఃకరణాలకు విలువెక్కువమ్మా. అలాంటివి కాదనుకుని, వేరే వాళ్ళని పెళ్ళిచేసుకున్నావ్! సుఖపడు. కానీ తల్లీ కష్టానికీ, సుఖానికీ ఆదుకునేందుకు నీ మేనత్త వుందమ్మా! అది మర్చిపోకు..."

తండ్రి మాటలు గుర్తుకొచ్చి, సుచిత్ర హృదయం ద్రవీభూతమైంది. ఎండమావుల వెంట పరుగు అయిందా బ్రతుకు అన్న అనుమానం కలిగింది సుచిత్రకు.

మోహన్‌కు చదువు, అందం, పెళ్ళినాటికి స్థిరమైన ఉద్యోగం వున్నాయి. సుచిత్ర పెళ్ళికి ఒప్పేసుకుంది.

ఢిల్లీలో కాపురం పెట్టాక సుచిత్రకు తెలిసిన మొదటి విషయం, తనుండేది బంగళా కాదు - రెండు గదుల ఇల్లు, అదీ నాలుగో అంతస్తులో.

"యిదే మన రాజభవన్" అన్నాడు మోహన్.

"ఇంతకన్నా మంచి ఇళ్ళు దొరకవా?"

"దొరుకుతాయి"

"అయితే మంచి ఇల్లు. గాలీ వెలుతురూ వచ్చేది, ఓ చిన్న గార్డెన్ వేసుకునేందుకు వీలున్నది చూడండి. ఈ ఆకాశసౌధంలో నేనుండలేను!"

మోహన్, ఓ వారం తర్వాత, సుచిత్రను తీసుకువెళ్ళి, రామకృష్ణాపురంలో ఓ ఇల్లు చూపాడు. సుచిత్రకు చాలా నచ్చింది. క్రొత్తగా కట్టిన ఇల్లు. ఇంటి చుట్టూ ఖాళీస్థలం. నాలుగు గదులు. వంటిల్లు, వరండా, షవర్‌బాత్.. అన్నీ నచ్చాయి. 'మై స్వీట్ హోం' యిదే అనుకుంది.

"తీసుకుందాం!" అంది, మోహన్ గుండెల మీద వాలిపోయి, కోటు గుండీలు సవరిస్తూ.

"ఓ.కే. మై లవ్! అద్దె ఏడొందల యాభై, పగిడీ పదివేలు కట్టాలి! మీ నాన్నకు వ్రాయి. నా కొచ్చే పన్నెండు వందల్లో అసాధ్యం"

సుచిత్ర కళ్ళ ముందు స్వర్గధామం పేకమేడలా కూలిపోయింది.

పావురాళ్ళ గూడులోలాగా వున్న రెండు గదుల్లోనే జీవితాన్ని కొనసాగించింది.

రోజులు గడిచేకొలదీ మోహన్ జీతం పెరిగింది. దాంతోపాటే ధరలు, ఖర్చులు, సుచిత్ర మనస్సులో వ్యధ పెరిగింది.

తిరగాలి. జీవితాన్ని అనుభవించాలి. చుట్టూ ఆనందం, కోరికలు! వయస్సు, తపన అన్నీ వున్నాయి.

కానీ,

పచ్చిక మైదానంలో, రాటకు చిన్న తాడుతో కట్టబడ్డ మేకపిల్ల - సుచిత్ర. అలా తోచింది జీవితం! దాంతో దిగులు! ఏదో పోగొట్టుకున్నానన్న భావం!

సుచిత్ర చిక్కిపోయింది.

తల్లి కూడ అయింది!

గానుగలా - తెల్లారటం, నీళ్ళ ఎద్దడి, నడి ఎండాకాలం కరెంటు లేకపోవటం, గాలీ, వెలుతురూ లేని ఇల్లు, ప్రొద్దునే పోయిన మోహన్, సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికి రావటం, తెల్లారుతుందనే భయం, వయస్సు గడిచిపోతున్నదన్న భయం....

మానసిక వ్యధ, చుట్టూ చిమ్మచీకటి, ఏళ్లు పైబడుతున్న కొద్దీ ముసలితనం వచ్చేసి,

జుత్తు తెల్లబడి, కళ్ల క్రింద, పొత్తికడుపు క్రింద మడతలు వచ్చేసి, గాజు కళ్ళతో ఏదో పొగొట్టుకున్నట్లు భ్రమ కలగటం... సుచిత్రకు మామూలైంది.

మోహన్ సుచిత్ర పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. కానీ వచ్చే జీతంతో, బాధ్యతా రహితంగా తిరిగి, జీవితాన్ని, పరువు ప్రతిష్టలను బాధామయం చేసుకోవటం అతనికి ఇష్టం లేదు. అలా అని, సుచిత్ర మోహంలోని చిరునవ్వునూ చైతన్యాన్ని వదులుకోలేడు.

వెన్నెల సాయంత్రాలు చెట్టాపట్టాలేసుకుని మోటారు సైకిళ్ళ మీద విహంగాల్లా పోతుండే యువతీ యువకులను చూసినప్పుడు, మసక వెలుతుర్లో ఒకర్నొకరు పెనవేసు కుని, మత్తెక్కిన కళ్ళతో కామాగ్నిలో కాలిపోతుండే జంటలను చూసినప్పుడు, శీతాకాలపు సాయంత్రాలు ఓవర్ కోట్లు, స్వెట్టర్లూ వేసుకుని, కబాబ్‌లు తినే స్త్రీ పురుషులను చూసిన ప్పుడూ, మోహన్‌కి సుచిత్ర జ్ఞాపకం వస్తుంది.

సుచిత్ర మంచం పట్టింది. నవ్వులో జీవం పోయింది. 'కీ' అయిపోయిన బొమ్మలా సంచరించసాగింది.

అప్పుడే భాస్కరం ఢిల్లీ వెళ్ళాడు. సుచిత్రను చూసి బాధపడ్డాడు.

"సుచీ! యిలా ప్రాణం లేని బొమ్మలా వున్నావేం?" అనడిగాడు.

సుచిత్ర నవ్వి, లేని హుషారు తెచ్చుకుని, "చాలా రోజులకు చూశావు. అందుకనే అలా అనిపిస్తుంది. నాకేం బాగానే వున్నాను బావా!" అంది.

"పోన్లే. నువ్వూ, మోహన్ కొన్నాళ్ళు సెలవు పెట్టి, మా వూరు రాండి! పెళ్ళయ్యాక నువ్వు రానేలేదు. ఏం, తప్పకుండా రావాలి" అని వొట్టు గూడ వేయించుకున్నాడు.

సుచిత్రకు పోవాలని లేదు. మోహన్‌కి సుచిత్ర నెక్కడికైనా కొన్నాళ్ళు తీసుకువెళ్ళి ఆమెకు గాలి మార్పు కలుగచెయ్యాలని వుంది. మోహన్ శలవు పెట్టాడు.

ఎక్కడికెళ్ళాలి?

"కొడైకెనాల్" సుచిత్ర అంది.

మోహన్ సుచిత్రవైపు జాలిగా, ప్రేమగా చూసి, "సుచీ! నాకూ కాశ్మీర్ వెళ్ళాలనీ, డాల్‌లేక్‌లో ప్రేమయాత్ర చెయ్యాలనీ వుంది. కానీ సుచీ, మన ఆర్థిక పరిస్థితి అంత అవకాశమివ్వదు మనకు. ఆర్థికంగా మన పరిస్థితి బాగుపడేసరికి, వృద్ధాప్యం వచ్చేస్తుంది. బాధ్యతలు పెరుగుతాయి. వెళ్ళగలిగినా వెళ్ళలేము. ఇదే జీవితం- మన చేతగానితనానికి కించపడేకన్నా, అందుబాటులో వున్నదాన్ని అనుభవించటం మంచిది! ఏమంటావ్?" అనన్నాడు.

"ఏం చేద్దామో మీరే చెప్పండి!"

"నీకిష్టమైతే, కొన్నాళ్ళు మీ బావ దగ్గర కెడదాం!"

సుచిత్ర అవుననలేదు. కాదనీ అనలేదు. మానసికంగా, శారీరకంగా, సుచిత్ర మోహన్‌ల మధ్య అభిప్రాయభేదాలు లేవు. కానీ అంతఃకరణాలలో ఐక్యత, ప్రేమానురాగాలు

లేవు. ఈ విషయం ఇద్దరకూ తెలుసు.

ప్రయాణమై రైలెక్కిన సుచిత్ర వర్షించబొయ్యే మేఘంలా వుంది. ఏ చిన్న తాకిడికైనా, ఆమెలోని దుఃఖం వెల్లువలా పారవచ్చు.

"నాలాంటి అశక్తుడిని చేసుకున్నందుకు విచారిస్తున్నావా సుచీ" అనడిగాడు మోహన్.

సుచిత్ర ఘెల్లుమని ఏడ్చి, వానకు తడిసిన పావురంలా ముడుచుకునిపోయి, మోహన్ కౌగిలిలో, "లేదండీ! మీలాంటి భర్తను పొందగలిగినందుకు గర్విస్తున్నాను. మీరు నాకేం తక్కువ చేశారని బాధపడాలి! కాకపోతే, నా మనస్సు స్వాధీనం కావటంలేదండీ. చుట్టూ వుండే రంగు రంగుల ప్రపంచం నన్ను మభ్యపెట్టి భ్రమలోకి నెట్టివేస్తున్నది!" అంది.

:: 3 ::

వారం రోజులయ్యాక పద్మ, సుచిత్ర మొహంలోని నీడలు తొలగిపోవటం గమనించింది.

సుచిత్ర, ఇదివరకులా మంచం మీదే ప్రొద్దస్తమానం కూర్చోకుండా, లేచి ఇల్లంతా తిరగటం, చిన్న చిన్న పనులు చేయడం ప్రారంభించింది.

బేబీని పట్టుకుని నీళ్ళు పోసి, తల దువ్వటం, బేబీ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం, తనూ వేళపట్టున స్నానం చేసి తల దువ్వుకుని, అలంకరించుకుని, పద్మతో కబుర్లాడటం మొదలెట్టింది సుచిత్ర.

"పద్మా! ఇక్కడ నువ్వెలా వుండగలుగుతున్నావ్?" సుచిత్ర ప్రశ్నించింది.

"సుచిత్రా! యిక్కడ పుట్టి పెరిగిన మనుషుల మధ్య వుండటం ఏమంత గొప్ప? నువ్వసలు మన భాషరాని వేరే ప్రాంతంలో వుండటం చాలా విశేషం!"

"ఢిల్లీ వెళ్ళాక యంత్రంలా మారిపోయాను. చెయ్యాలంటే పని వుండదు. ఆయన ఆఫీసుకు, బేబీ ఆడుకునేందుకూ వెడితే, పుస్తకాలు, రేడియో, టీవీ - ఇవే కాలక్షేపం, ఎంతసేపూ ప్రేమలు, విరహం, విడిపోవటం ఇవే అన్నిటా! రోజల్లా ఏ పనీలేక, కొంత నాకు జబ్బు చేసింది!"

పద్మ నవ్వి, "అందుకే సుచిత్రా, నేను అన్ని పనులు కల్పించుకు చేసుకునేది. ఇక్కడ మట్టుకు పెద్ద పనేముంది? ఏం లేదు - కానీ అస్సలు ఏమీ పని చెయ్యకుండా వుంటే మనస్సు, శరీరమూ మొద్దుబారిపోయి, చెడు ఆలోచనలకు బానిసలమవుతాము."

సుచిత్రలోని మార్పు మోహన్ గమనించాడు. "నీ కిక్కడ బావుందా!" అనడిగాడు ఓ రోజు.

"నేనూహించుకున్నంత భయంకరంగా ఏం లేదు!" అంది సుచిత్ర.

"నాకయితే, ఈ వూరొదిలి వెళ్ళాలనిపించడం లేదు. మీ బావనడిగి వప్పుకుంటే, అతనితోపాటే యిక్కడే వుండి, వ్యవసాయం చేద్దామని వుంది!"

"వుండిపోండి! ఇప్పటి మీ అవతారం చూస్తే ఎవ్వరూ ఆఫీసరని అనుకోరు!"

"నువ్వు కాదూ అనకుంటే చాలు!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

సుచిత్ర నవ్వు చూసి మోహన్ హృదయం తేలికపడ్డది.

ఓ రోజు తెల్లవారుఝామునే భాస్కరం సుచిత్ర, మోహన్, పద్మ, బేబీలను తీసుకు లంకలోని తోటకు ప్రయాణం కట్టించాడు.

వూరికి ఓ మైలు దూరంలో నది! ఓ పాయలో మటుకు పడవలో ప్రయాణం చెయ్యాలి. ఆ తర్వాత రెండు ఫర్లాంగుల నడక. ఆ తర్వాత, మామిడి తోటలు.

"ఈ రోజు మనం తోటలో వండుకు తిని, సాయంత్రం తిరుగు ప్రయాణం చెయ్యాలి." అని చెప్పాడు భాస్కరం.

తెల్లవారుఝామున, ఎద్దుల మెళ్లో మువ్వల చప్పుడు తప్ప, ప్రకృతి అంతా నిద్రిస్తున్న వేళ, తూర్పున చీకటి గర్భం చీల్చుకు వెలుతురు బయటకు వస్తున్న సమయంలో ప్రయాణం మోహన్‌కు చాలా ఆహ్లాదకరంగా వుంది. సుచిత్ర నిమ్ము తగులుతుందేమోనని, చీరకొంగు తలనిండా కప్పుకుంది. భాస్కరం తొట్లో కూర్చుని బండి తోలాడు.

నిద్రిస్తున్న నీళ్లల్లోంచి దారి చేసుకుని పడవ నెమ్మదిగా పాయ అవతలకు చేరేసరికి సూర్యుడు తూర్పు కొండల మీద నుంచి తొంగి చూశాడు.

పట్టులా వున్న ఇసుకలో నడుస్తుంటే, సుచిత్రకు చాలా తమాషాగా వుంది. బేబీ అయితే చెంగున ఎగురుతూ, పాలపిట్టలా పరుగులు తీసింది. పాలేరు సరుకులు మోసుకుని వచ్చాడు.

తోటలో కెళ్లేసరికి బారెడు ప్రొద్దెక్కింది. కోకిలలు, రామచిలుకలు కోరస్ పాడినట్లు కబుర్లు చెప్పుకుంటున్నాయి. మామిడి చెట్లకు పూత, పిందె వుండి నెలలు నిండిన గర్భిణీ స్త్రీలలా వున్నాయి.

వెళ్లిందే తడవుగా, పద్మ బిందెతో నీళ్ళకు వెళ్లింది. ఈ లోపల వూరికే కూర్చుంటే బాగోదని సుచిత్ర పొయ్యి ఏర్పాటు చేసి, గోతంలోంచి గిన్నెలవీ తీసి, పొయ్యి రాజేసి కాఫీ డికాషన్ వేసింది. పాలేరు తెచ్చిన పాలు పొయ్యి మీద పెట్టింది.

"అదేమిటి సుచీ! నీకెందుకీ పనులు? నువ్వలా కూర్చోవమ్మా!" అంది పద్మ.

సుచిత్ర అందుకు వప్పుకోలేదు.

"పద్మా - ప్లీజ్! నా మాట కాదనకు. ఈ ఒక్కరోజూ వంట పని నా కొదిలెయ్యి."

సుచిత్ర మాటలకు పద్మ ఆశ్చర్యపోయింది.

"అదిగాదు సుచిత్రా! నీ ఆరోగ్యం... బాగో..."

"ఏం ఫర్వాలేదు. ఈ ఒక్కరోజు నా కొదిలెయ్యి!"

సుచిత్ర మూడీ మనిషి! అది తెలిసిన పద్మ బుద్ధిమంతురాల్లా కూర్చుంది. అయినా ఊరుకోబుద్ధి కాలేదు. కూర తరిగి పెడదామని కత్తిపీట ముందేసుకుంటే సుచిత్ర

వూరుకోలేదు.

"పద్మా! ప్లీజ్! నువ్వసలు ఈ రోజు వంటలో వేలెట్టకూడదు. బాగున్నా, చెడిపోయినా క్రెడిట్ అంతా నాకే రావాలి!" అంది సుచిత్ర.

"మరి నేనేం చేసేది?"

"బేబీతో కలసి ఆడుకో! లేదా పాట పాడు!"

పద్మ, సుచిత్ర చేసే వంటనే చూస్తూ, సుచిత్ర పడే అవస్థ చూసి జాలి పడ్డది. గాలికి మంట తగలక కట్టెలు మండక, క్రింద ఇసుకతో సుచిత్ర పడే అవస్థ చూసి, "అది గాదు..." అని ఏదో చెప్పబోయింది.

సుచిత్ర ఖస్సుమని లేచి, "యిదిగో పద్మా, మళ్లీ నా వంటలో జోక్యం చేసుకుంటే, నాకు తిక్కరేగుతుంది. వెళ్ళిక్కడనుంచి" అని కసురుకుంది.

పద్మ సుచిత్ర అవతారాన్ని చూసి నవ్వుకుని వెళ్ళిపోయింది.

బేబీ నీళ్ల వడ్డుకు చేరి పిచ్చుక గూళ్లు కడుతుంటే, భాస్కరం సహాయం చేస్తున్నాడు. మోహన్ వంటి మీద డ్రాయర్ మినహా ఏమీ లేకుండా వళ్ళంతా వండ్రుమట్టి పట్టించుకుని పద్మాసనం వేసుక్కూర్చున్నాడు.

"అదేమిటీ! వంట సుచిత్ర కప్పచెప్పి ఇలా వచ్చావ్?" అనడిగాడు భాస్కరం.

"మీ మరదలు శపథం పట్టింది! ఈ రోజు ఆమె ఒక్కతే చేస్తుందట. నన్ను అక్కడ వుండకుండా తరిమివేసింది!"

"భాస్కరం గారూ! మా ఆవిడ వీరపత్ని. పట్టు పట్టనే పట్టదు! పట్టితే విడవదు కనుక మీరూ షికార్లు కొట్టండి. నేను కూతవేటు దూరంలో వుండి మా ఆవిడను కాచుకుంటాను" అన్నాడు మోహన్.

బేబీని తీసుకు భాస్కరం, పద్మ నీళ్ళ వారనే నడుచుకుంటూ వెళ్లారు.

మోహన్ వెళ్లేసరికి, సుచిత్ర కొంగు నడుముకు బిగించి వంట చేస్తున్నది. వొళ్ళంతా చెమట పట్టి, నివురు పోయిన నిప్పులా వుంది సుచిత్ర. వళ్ళంతా వండ్రుమట్టితో, టార్జాన్‌లా వున్న మోహన్‌ను చూసి, "ఈ అవతారం ఏమిటీ?" అని అడిగింది.

మోహన్ నవ్వాడు.

"కాఫీ త్రాగుతారా!"

"ఊ."

కాఫీ కలిపి ఇద్దరూ త్రాగారు.

"ఇలాంటి కాఫీ త్రాగి ఎన్నాళ్ళయిందో!" అన్నాడు మోహన్.

"నిజం.... చాలా బావుంది! నాకూ ఇప్పుడిప్పుడే రుచి తెలుస్తున్నది" అన్నది సుచిత్ర.

మోహన్ ప్రక్కనే వుండి కబుర్లు చెబుతూ, వంటలో సాయం చేస్తుంటే, చకచకా వంట చేసింది సుచిత్ర.

సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చేసరికి బేబీ, భాస్కరం, పద్మ వచ్చారు - స్నానం చేసి తడిగుడ్డలతో.

"సుచిత్రా! నువ్వెళ్ళి స్నానం చేసిరా! మిగతా పని నే చూస్తాను!" పద్మ పని అందుకుంది.

సుచిత్రకు వంటయ్యేసరికి నీరసం వచ్చేసి వాడిపోయింది. పొయ్యి సెగకు అగ్నిపునీత సీతలా అయింది.

సుచిత్ర చేయి పట్టుకుని మోహన్ తీసుకెళ్ళాడు.

నిర్మలంగా, నదిలో నీరు పసిపాప నవ్వులా పారుతోంది.

చల్లని నీళ్ళలో మునిగి తేలేసరికి, సుచిత్రకు ప్రాణం లేచివచ్చింది. శక్తి వచ్చింది. ఉత్సాహమూ వచ్చింది. ఓసారి మోహన్ సహాయంతో ఈదటానికి ప్రయత్నించింది.

"ఇలా ప్రశాంతమైన చోట కాలం గడిపితే ఎంత బావుండు."

మోహన్, సుచిత్రను దగ్గరకు తీసుకని ముద్దెట్టుకున్నాడు.

"ఈ గాలీ, వెలుతురు, నీళ్లూ, స్వచ్ఛమైన పాలు, కూరలు, అనుభవించి మళ్లీ పట్నం వెళ్ళాలంటే నాకు బాధగా ఉంది సుచీ!" అన్నాడు మోహన్.

'నాకూ అంతే' అని చెప్పాలనుకుని చెప్పలేకపోయింది సుచిత్ర.

భోజనాలయ్యాక, ఓ పెద్ద గుబురున్న మామిడి చెట్టు క్రింద అందరూ విశ్రమించారు.

"మా సుచిత్ర ఇంత బాగా వంట చేస్తుందని తెలియదు సుమా" అన్నాడు భాస్కరం.

"ఇవ్వాళ బాగా చేసింది! ఒప్పుకుంటాను - కానీ పద్మగారి వంట తర్వాతే" అన్నాడు మోహన్.

"పొరుగింటి పుల్లకూర అంతే" అంది పద్మ.

సూర్యుడు పశ్చిమాని కొరిగాక, అందరూ మామిడి తోట, పుచ్చకాయల తోట, జామ తోట తిరిగారు. రెల్లుపొదల మధ్య కూర్చున్నారు. అప్పుడే, మోహన్ బలవంతం మీద, పద్మ పాట పాడింది. 'ఎంకిపాట'.

ఆ పాట వింటూ, మోహన్ తన్మయత్వం చెందాడు. అతని వళ్ళు, కళ్ళు పులకించాయి.

"పద్మగారూ! మీరు ఏ జన్మలోనో గంధర్వులు," అన్నాడు మోహన్.

పద్మ తలొంచుకుంది, ఆ మెచ్చుకోలుకు. భాస్కరం మొహంలో ఎందుకో మబ్బు తునకలు కదలాడాయి. అది సుచిత్ర గమనించింది.

:: 4 ::

"మీకు తెలుసో లేదో! పద్మ - భాస్కరం ఎంతో అన్యోన్యంగా వున్నట్లు కనబడతారు గానీ, నిజానికి వాళ్ళ మధ్య ఏవో భేదాభిప్రాయాలున్నాయి!"

సుచిత్ర మొహంలో ఆశ్చర్యం, ఆనందం, తృప్తి చూసి మోహన్ బాధపడ్డాడు.

నిజంగా వాళ్ళిద్దరి మధ్య బేధాభిప్రాయాలున్నాయా! లేక సుచిత్ర రాజేసిన పొగా యిది? అనుకున్నాడు.

ఒకసారి గతం గుర్తుకొచ్చింది.!

యం.ఏ. అయ్యాక మోహన్ ఓ మిత్రుడితో తొలిసారి పల్లెటూరెళ్లాడు. వెళ్లాక ఓ పెళ్లి సంబంధమూ చూసాడు అనుకోకుండా!

పిల్లతండ్రి రిటైర్డు బడిపంతులు! పిల్లలందరికీ చదువులు, పెళ్ళిళ్లు చేసి పంపించేసి ఆఖరి పిల్లను దగ్గరుంచుకుని, ఓ చెరువు గట్టు ప్రక్క చిన్న జామ తోటలో పూరిగుడిసె వేసుకుని వున్నాడు. ఓ రకంగా అది ఆశ్రమంలా ఉంది. పిల్ల తండ్రి బాగా ముసలివాడు.

పిల్ల చదువుకుంది. చక్కగా పాడుతుంది. పెళ్ళిచూపుల రోజే బిడియ పడకుండా చక్కగా ఓ త్యాగరాయ కృతి పాడింది కూడా. సున్నివుండలు, మజ్జిగ టిఫినుగా ఇచ్చారు. పిల్ల ఎర్రగన్నేరు పువ్వులా వుంది, అలంకరణ లేమీ లేకుండా.

మోహన్ ఆ వాతావరణం, పిల్ల తండ్రి చాదస్తం, పిల్ల మొహంలోని అమాయకత, స్వచ్ఛత ఎంజాయ్ చేశాడు.

కానీ పూర్తిగా పల్లెటూరి మనుషులు. నాగరికత ఏ కోశానా లేదు. అంతేగాక తను ఏ ఐ.ఎ.యస్., ఏదో ప్యాసయి, దేశవిదేశాల్లో తిరుగుతుంటే, వెంట ఏ మాత్రం నాజూకు, నవ్యత లేని పిల్లను పెళ్లాంగా తీసుకెళ్ళటం ఇంపాజిబుల్!

అదే చెప్పాడు అప్పుడే, అక్కడే!

ముసలాడు ఏమనుకున్నాడో గానీ, పిల్ల మాత్రం, "మనసులోని మాట చెప్పారు. చాలా సంతోషం" అంది. ఆ మాట అనేప్పుడు ఆమె మొహంలో, కళ్ళలో, గొంతులో ఏ భావమూ వ్యక్తం గాకుండా!

ఇది జరిగి చాలా రోజులైంది. అయినా ఆ రోజింకా గుర్తుంది మోహన్‌కు. కారణం? ఆ రోజు పాడిన పాట!

ఓ రోజు భాస్కరంతో అన్నాడు.

"మీ శ్రీమతి పాటలు చాలా బాగా పాడుతుంది. రేడియో, సినిమాల్లో ట్రై చేస్తే బావుండేదేమో."

భాస్కరం మొహంలో మచ్చుతునకలు కదలాడాయి.

చేను గట్టు మీది గడ్డిలో పడుకుని, ఆకాశంలోకి చూస్తూ "మోహన్! ఆమె పాట విని ముగ్దుడనై ఆమెను కట్నం కానుకలు లేకుండా చేసుకున్నాను. అలాంటి గాత్రం చాలా అరుదుగా వుంటుంది. ఆ మధ్య ఫిలిం మ్యూజిక్ డైరెక్టర్‌గారు పద్మ పాట విని, తక్షణం మద్రాసు రమ్మని, ఐదేళ్ళు నెలకు రెండు వేల జీతం మీద కాంట్రాక్టు కూడా ఇప్పిస్తానని ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాశాడు!" చెప్పటం ఆపి నిట్టూర్చాడు భాస్కరం.

"మరెందుకు వెళ్లలేదు?"

"పద్మ కిష్టం లేదు!"

"ఏం?... ఎందుకని?"

"అదో చిత్రమైన మనస్తత్వం! అంతే!"

మోహన్ ఏదో అడగాలనుకుని, బాగుండదేమో, భార్యాభర్తల మధ్య లక్ష రహస్యాలుంటాయి అని వూరుకున్నాడు.

ఓ క్షణం తర్వాత భాస్కరమే చెప్పాడు.

"విలువైన వస్తువు అనుకుంటే వీధుల్లో పారెయ్యటం నాగరికతా లక్షణం గాదు. దాచుకోవాలి భద్రంగా! నిజంగా నా గొంతులో మాధుర్యం, ఆర్ద్రత, గొప్ప అనుభూతులు వుంటే, అది మీకు, నాకు ఆనందాన్ని ఇవ్వాలి. మనమే అనుభవించాలి. అంతేగానీ దాన్ని బజారులో పెట్టి డబ్బుకు అమ్మేయటం మంచిదిగాదు. కీర్తి, డబ్బు అక్కర్లేదు - అంటుంది పద్మ - అదొక రకమైన వాదన. మొండితనం లేదు. ప్రార్థనా లేదు. అందుకే... అంత అదృష్టాన్ని పొందిన నేను గర్వపడాలో, అదృష్టాన్ని ఉపయోగించుకోలేనందుకు విచారించాలో తెలియటం లేదు."

పద్మ వ్యక్తిత్వం అపురూపంగా తోచింది మోహన్‌కు.

మారుతున్న కాలం, విలువలు, దృక్పథం వీటి మధ్య అచంచలమైన శిఖరంలా - పద్మ వుండటం ఆశ్చర్యమే!

"పోతే మోహన్... మీరు నా బ్రదర్ లాంటి వారు కనుక చెబుతున్నాను. ఆమెకు కోరికలు లేవు. ఆశయాలు లేవు. దూరతీరాల గురించి భ్రమలూ లేవు. వెరీ వెరీ సింపుల్. అలా వాళ్ళ తండ్రి తయారు చేశాడు. అలాగే పెరిగింది. పెళ్ళయి యింతకాలమైనా ఆమెలో మార్పు లేదు. అందుకే పద్మను ఆరాధిస్తాను. అందుకే శాసించలేకుండా వున్నాను."

మోహన్‌కు చాలా అనుభవాలున్నాయి. పరిచయాలున్నాయి.

యూనివర్సిటీలో కంపెనీ కోసం కొందరు స్త్రీలతో తిరిగాడు, వెన్నెల సాయంత్రాలు బీచ్‌లో!

డబ్బు కోసం, హోదా కోసం వృద్ధులను పెళ్ళాడి, అనుభవం కోసం, కోరికలు వేడి చల్లార్చుకోటానికి కారులేసుకుని, వలలు పన్నే సుందరాంగులతోనూ సరసం సాగించాడు మోహన్.

కాలేజీల్లో చదువుతూ, పౌడర్లూ, సినిమాలూ, అలంకరణల ఖర్చు కోసం క్షణం శీలాన్ని అమ్ముకుని బ్రతికే కన్యలతోనూ సాంగత్యం వుంది మోహన్‌కు.

తండ్రి పొయ్యాక, ఆశించిన ఉన్నత పదవులు ఆకాశ దీపాలయ్యాక, దొరికిన ఉద్యోగాన్ని పట్టుకుని సుచిత్రను వివాహమాడాడు మోహన్.

పద్మ గురించి విన్నాక, మోహన్‌కు పద్మంటే గౌరవం పెరిగింది. ఆరాధన హెచ్చింది.

రెండు నెలలు ఇట్టే గడిచాయి.

సుచిత్ర గోగుపుల్లలా వచ్చి రెండు నెలలకు చెఱుకు గడలా అయింది.

ఆమె కళ్ళల్లో ఆనందము, ఉత్సాహమూ వచ్చాయి. నడకలో, మాటలో, ప్రవర్తనలో సౌకుమార్యం, లాలిత్యం తగ్గి, ఆరిందాతన మొచ్చింది.

ప్రయాణం రోజు దగ్గర పడ్తుండగా, భాస్కరం టౌన్ కెళ్ళి సుచిత్రకు జరీ చీరె, మోహన్‌కు పొందూరు ఖద్దరు ధోవతులు, సిల్క్ లాల్చీ, కండువా తెచ్చాడు. బేబీకి రకరకాల ఫ్రాకులు తేవడమేగాక పట్టు పరికిణీ, జాకెట్ కుట్టించాడు.

పద్మ బేబీకి పూలజడ వేసింది బంతిపూలతో చెవులు కుట్టించి, లోలకులు చేయించింది. కాళ్లకు వెండి పట్టాలు తొడిగింది. అంతేగాక, మెళ్లోవున్న చంద్రహారం తీసి మెళ్లో వేసి, "యిది నా కానుక!" అంది.

సుచిత్రకు కళ్ళు ఆర్ద్రమైనాయి. వళ్ళు పులకించింది. పద్మను వాటేసుకుని, "ఏమిటి పద్మా నీ చాదస్తం!" అంది గద్గదమైన స్వరంతో!

"సుచిత్రా! ఈ మాత్రం దానికి నువ్వింత 'మూవ్' అవటం బాగోలేదు!" అంది పద్మ.

"మే మెవరమని?"

పద్మ చిన్నగా నవ్వింది.

"భార్యాభర్తలు ఎవరికెవరు! మూడు ముళ్ళతో ఎంతో దగ్గరై, వందేళ్ళ జీవితాన్ని పంచుకోవటం లేదూ! అంతే... మనమూ అంతే సుచీ-బంధాలు బంధుత్వాలు సెంటిమెంట్స్ ముడివేసుకోవద్దు. మనం స్నేహితులం. అంతే. నాకున్నది నీది! నీకున్నది నాది!"

సుచిత్ర మాట్లాడలేదు. తల్లి తోడులా, పద్మ అనునయించడం, ప్రేమగా చూడటం, ఇవన్నీ సుచిత్ర హృదయాన్ని ద్రవీభూతం చేశాయి.

మోహనయితే పొంగిపోయాడు. రెండు నెలలు ఓ కుటుంబాన్ని తమలో కలుపుకుని, సుఖాన్నే పంచియిచ్చిన భాస్కరం - పద్మ అపురూపంగా తోచారు.

సుచిత్రను, మోహన్‌ను సాగనంపటానికి పద్మ భాస్కరం పట్నం వచ్చారు.

పద్మకు బేబీని వదిలి వుండాలంటే గుండెల్లో గుబులుగా వుంది. పెళ్ళయిన తదాపి, పద్మ జీవితంలోకి ప్రవేశించి, గాఢంగా పెనవేసుకుపోయిన వ్యక్తి భాస్కరం తరువాత బేబీయే!

"బేబీని వుంచేసుకుందాం!" అంది భాస్కరంతో.

"ఏం మనకు పిల్లలు పుట్టరని భయమా?"

పద్మ సమాధానం చెప్పలేదు. పెళ్ళయి ఐదేళ్ళయినా యింతవరకు పిల్లలు లేనేలేరు. ఇక ముందు పుడతారన్న నమ్మకం ఏముంది? ఈ అనుమానాన్ని పద్మ చెప్పలేదు.

ఆ ప్రస్తావన అంతటితో ఆగిపోయింది. పద్మ బేబిని ఎత్తుకుని, "ఇక్కడ వుండరాదుటే" అనడిగింది.

"అమ్మో! బడి కెళ్లొద్దూ" అంది బేబీ. పద్మ మనసు మూగబోయింది. ఎంతయినా బేబీ చిన్నపిల్ల. తల్లి నొదలి వుండలేదు అని సరిపెట్టుకుంది.

రైల్లో కూర్చున్నాక మోహన్ భాస్కరంతో, "వదినగారిని తీసుకు ఢిల్లీ తప్పక రండి" అని మరీ మరీ చెప్పాడు. సుచిత్రకూ ఆ మాట చెప్పాలని వుంది. మోహన్ చెప్పేసరికి, "మనం పిలిస్తేనే యింత దూరం వచ్చి, వాళ్లింట్లో వున్నామా! అయినా పద్మదేం లేదండి. అంతా మా బావ యిష్టం" అంది సుచిత్ర.

బండి కదలే వేళయింది. సుచిత్ర, భాస్కరం ఏదో మాట్లాడుకుంటున్నారు.

మోహన్ పద్మ దగ్గిరగా వచ్చి, "నన్ను గుర్తుపట్టారా!" అనడిగాడు.

పద్మ చిన్నగా నవ్వింది. సమాధానం కోసం మోహన్ ఆగాడు. రైలు బయలుదేరింది. మోహన్ మొహంలో నిరుత్సాహం తొంగి చూసింది. పద్మ అది గమనించి నిట్టూర్చింది.

మోహన్‌ను మొదటిసారి చూసినప్పుడే పద్మ గుర్తించింది. కానీ, మోహన్‌కు తను ఇంకా గుర్తు వున్నందుకు ఆశ్చర్యం వేసింది.

:: 5 ::

సుచిత్ర, మోహన్ వెళ్లింతర్వాత పదిహేను రోజుల్దాకా పద్మకు బేబీయే గుర్తుకు రాసాగింది. ఏ పని చేస్తున్నా, 'బేబీ యిప్పుడేం చేస్తుందో' అన్న ఆలోచన పద్మను వదల్లేదు. పొలం పనుల్లో భాస్కరం, పద్మ సంగతి అంతగా విచారించలేదు. రోజులు గడిచే కొలదీ, ఎంత మర్చిపోదామన్నా పద్మకు బేబీ గుర్తుకు వస్తూనే వుంది.

పగలు, ఏదో పనిలో లీనమై మనస్సు సరిపెట్టుకున్నా, రాత్రిళ్ళు, పద్మకు నిద్ర పట్టేది గాదు. భాస్కరం ఆదమరచి నిద్రపోతుంటే పద్మ లేచి కూర్చుని ఏ తులసి కోట ప్రక్కనో, బావిగట్టు మీదో కూర్చుని ఆకాశంలో నక్షత్రాలను లెక్కపెడుతూ జాములు గడిపేది. అలా గడుపుతున్న సమయాల్లోనే ఓసారి పాట గూడ పాడుకునేది.

సర్వప్రకృతీ గాఢ సుషుప్తిలో వున్న వేళ, మనస్సు విప్పి, గుండె గొంతుక లోంచి పొంగి పొరలివచ్చిన పాటతో పద్మ తేరుకునేది.

సుచిత్ర ఢిల్లీ వెళ్లేక ఉత్తరం వ్రాసింది. అందులో సగం ఉత్తరం తాము ఆ వూళ్లో పద్మా వాళ్ళతో గడిపిన మధుర క్షణాల గురించీ, మిగతాది ఢిల్లీలో, తాము పడుతున్న ఇబ్బందుల గురించీనూ. ఆఖర్న మాత్రం, తాను మళ్లీ తల్లిని కాబోతున్నాననీ, ఈసారి కొడుకు పుడితే ఆపరేషన్ చేయించుకుంటాననీ వ్రాసింది.

సుచిత్ర వ్రాసిన ఆ ఉత్తరంలోని ఆఖరి వాక్యాలు పద్మ పదిసార్లు చదువుకుంది.

సుచిత్ర పెళ్లీ, పద్మ పెళ్ళీ దాదాపు ఒకే సంవత్సరంలో జరిగాయి. సుచిత్రకు అప్పుడే ఓ కూతురు, మరికొన్నాళ్ళకు ఓ కొడుకు!

మరి తనకూ?

సిరి వుంది. సంపద వుంది. కలిమి వుంది. బలముంది. అయితే మాత్రం కడుపు పండి ఒడి నిండనినాడు, స్త్రీత్వం ఫలించనినాడు, అన్నీ వృథా!

కాలచక్రంలో పగలూ రాత్రీ గడిచిపోతూనే వుంటాయి. ఋతువులు మారుతూనే

వుంటాయి. వాటితోపాటు యవ్వనం గడిచిపోయి, వృద్ధాప్యం ముంచుకువస్తుంది. బ్రతుకు చరమాంకంలో పిల్లలు లేకపోతే, బ్రతుకులో ఆనందం కరువయిపోతే ఎలా?

పద్మకు దిగులు పట్టుకుంది.

వ్రతాలు ఆరంభించింది.

పూజలు చేయసాగింది.

భాస్కరం పద్మలోని పరివర్తన గమనించాడు. ప్రవర్తనలోని వైవిధ్యాన్ని గుర్తించాడు.

"పద్మా! రాను రాను నువ్వు మరీ చాదస్తంగా తయారవుతున్నావు" అన్నాడు.

"మీ జాతకంలో పిల్లలు పుట్టే యోగం వుందో లేదో తెలుసుకున్నారా?"

పద్మ ప్రశ్నకు భాస్కరం విస్తుపోయాడు.

"నీకు పిల్లలు లేరని చింతగా వుందా?"

పద్మ మాట్లాడలేదు. కానీ ఆ మౌనం గడ్డకట్టి ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్లుగా బయట కొచ్చాయి.

"మనకేమంత వయసు మించిపోయిందని పద్మా! ఇప్పుడే దిగులు పడుతున్నావ్?" అని సముదాయించాడు.

"వయస్సు మించాక దిగులుపడీ ప్రయోజనం వుండదండీ! అందుకే ఈ దిగులు."

భాస్కరానికి దిక్కుతోచలేదు.

ఇంతకాలమూ, తమకు పిల్లలు లేరన్న ధ్యాస, ఆలోచన, భాస్కరానికి రాలేదు. పద్మా ఆ ఊహ ఎప్పుడూ వెళ్ళబెట్టలేదు. నిశ్చలంగా వున్న కొలనులా.

సుచిత్ర మోహన్‌ల రాక, బేబీతో అనుబంధం, పద్మ మనసులో అగ్నికణాలు రాజేశాయి.

భాస్కరం ఆలోచనలతో సతమతమవుతుండగానే, పద్మ సోదె చెప్పించుకుంది. కోయ వాడిని పిల్చి చెయ్యి చూపించుకుంది. దేవుళ్ళకు మొక్కుబడులు పెట్టుకుంది. మనిషి పూర్తిగా డీలా పడిపోయింది. అప్పటికీ భాస్కరం చెప్పి చూశాడు!

"పద్మా! హాయిగా వున్న సంసారంలో, పిల్లల గొడవ తెచ్చావు. పుడితే పుడతారు. పుట్టరూ ముంచుకుపోయింది లేదు. అనవసరంగా ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నావు!"

"లేదండీ! పిల్లలున్న ఇల్లే స్వర్గం! యింత ఆస్థి వుండి ఏం లాభం పిల్లల్లేకపోయాక. పిడిరాళ్ళల్లా మనిద్దరం ఎంతని తింటాం, ఖర్చు పెడతాం? సుచిత్రకు చూడండి. రేపో మాపో కొడుకు పుడతాడు. ఈ సారి వాళ్లొచ్చేసరికి మనింట్లో పాపో, బాబో లేకపోతే, నా మొహం వాళ్ళకు చూపించలేను."

పద్మ నిర్ణయం విన్నాక భాస్కరానికి ఏం చెయ్యాలో తోచలేదు.

తక్షణం పద్మను తీసుకు పట్నం వెళ్లాడు! వెళ్లి అక్కడ ఓ పెద్ద డాక్టరుకు పద్మను చూపించాడు. తనూ పరీక్షలు చేయించుకున్నాడు.

డాక్టరు పిల్లలు పుడతారని చెబుతాడో? లేదో! పుట్టరని చెబితే పద్మ ఎలా ప్రవర్తిస్తుంది? ఊహించలేకపోయాడు భాస్కరం! హాయిగా వున్న ప్రాణానికి తెగిపోని సంకటం తెచ్చింది పద్మ అని అనుకున్నాడు.

"అబ్బే ఈ పరీక్షలన్నీ బూటకమండీ! డబ్బు గుంజటానికి, డాక్టర్లు వేసే ఎత్తులు. అంతే! వెధవది ఈ రోజుల్లో, సంవత్సరం తిరక్కుండా పిల్లలు పుడుతున్నారు. అలాంటిది మనకింతకాలం పిల్లలు పుట్టలేదంటే ఇహ పుట్టరు. మా వంశంలో, తరానికి ఒకళ్ళకు పిల్లలు పుట్టకపోవటం ఆచారమట. ఆచారం తప్పకుండా నా కొచ్చింది! అవునూ! మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే? అయిడియా ఎలా వుంది. ఆలోచించండి! ఏం? కన్నంత మాత్రానే పిల్లలా! ఏమంటారు. దేవకి కంటే, రాధ పెంచలా! నేనూ అంతే!" - పద్మ ఇలా మాట్లాడసాగింది.

పద్మ ధోరణి, మాటల తీరు చూసి భాస్కరం డీలా పడిపోయాడు. గుంభనంగా బొండుమల్లెపువ్వులా పద్మ ఇలా అర్థం పర్థం లేకుండా మాట్లాడడం భాస్కరానికి ఆశ్చర్యం, విచారం కలుగచేసింది.

పెళ్ళిచూపులప్పుడు... పద్మ గాత్రమాధుర్యానికి ముగ్ధుడైనాడు. ఆ తర్వాత, ఆమె నిండు మనస్సుకు, పనిపాటల్లో నేర్పరితనానికి ఆకర్షితుడైనాడు. సంసారం నడపటంలో చాకచక్యం, ఆరిందాలా అన్నిటా ప్రవర్తించే పద్మ నిపుణతకు మరీ లొంగిపోయాడు భాస్కరం! భాస్కరం తల్లి గూడ, "పద్మ లాంటి పిల్లలు ఈ రోజుల్లో అరుదురా! కోటి కొక్కరుంటారు. చదువుకున్నా నిగర్వి, అందచందాలున్నా భేషజం లేని అమాయకురాలు! పూలలో తావిలా సకల సద్గుణాలకు నిలయంరా పద్మ!" అని అనేది బ్రతికున్నాళ్లూ!

అలాంటి పద్మ, పిల్లల కోసం వివశురాలవటమే భాస్కరానికి ఆశ్చర్యంగా వుంది!

అన్ని పరీక్షలు చేసిన తరువాత, డాక్టరు పద్మ నడిగింది. "చూడమ్మా! నీకు పిల్లలు పుట్టరని చెబితే ఏం చేస్తావ్?"

"నిజంగా పుట్టరంటారా?"

"పుడతారమ్మా! ముఖ్యంగా నీవు పిల్లల గురించి బెంగపడటం ఆశ్చర్యంగా వుంది. చదువుకున్నావ్. మంచి ఆరోగ్యవంతురాలివి. ఆడవాళ్ళు ఈర్ష్యపడే లాంటి ఉత్తముడు భర్తగా దొరికాడు. మరి నీ కెందుకు పిల్లలు కలగరని అనుమానం వచ్చింది?"

పద్మ మాట్లాడలేదు. తలొంచుకుంది.

"చూడమ్మా! నీలో, మీ ఆయనలో ఏ లోపమూ లేదు. పిల్లలు పుట్టరని చెప్పేందుకు ఆస్కారం లేదు. మీకు తప్పకుండా పుడతారు!"

"ఎప్పుడు?" పద్మ ప్రశ్నించింది.

"అదే ఎవ్వరూ చెప్పలేని సమాధానం! డాక్టరుగా నే చెప్పగలిగింది ఒక్కటే - పిల్లలు పుట్టరన్న భయం నీలోంచి పూర్తిగా పోతే, తప్పకుండా పుడతారు."

పద్మకు డాక్టరు సమాధానం నచ్చలేదు. ఆ విషయం ఆమె ముహంలో ప్రస్ఫుటంగానే ద్యోతకమైంది.

"చూడు భాస్కరం! ఆమె మనస్సుకు వేరే వ్యాపకం అవసరం. పిల్లల మీద నుంచి మనస్సు వేరే దాని మీద లగ్నం కావాలి. అప్పుడే నీకు తండ్రయ్యే అవకాశం!"

డాక్టరు దగ్గర్నుంచి బయటకు రాగానే పద్మ ఖస్సుమని లేచింది.

"ఈవిడ డాక్టరా! లేక వేదాంతా! పిల్లలు పుడతారుట! ఎప్పుడో తెలియదుట! ఆహా అబద్ధాన్ని ఎంత తియ్యగా చెప్పిందండి!... లాభం లేదు. నాకు పిల్లలు పుట్టరు. మీరు వేరే పెళ్ళి చేసుకోండి పిల్లల కోసం."

పద్మ ధోరణికి భాస్కరానికి చిర్రెత్తుకొచ్చింది.

"పద్మా! నువ్విలాగే వాగావంటే నేను సన్యాసుల్లో కలుస్తాను. వెధవ గోల. జీవితంలో మరేం లేనట్లు, ఈ పిల్లల గోల ఎక్కడ పట్టుకుంది నీకు" అని విసుక్కున్నాడు.

ఆ రాత్రి పద్మ అన్నం తినలేదు. మాట్లాడలేదు. భాస్కరమూ తల పట్టుక్కూర్చున్నాడు.

వాళ్లిద్దరి మధ్యా నిశ్శబ్దం పేరుకుపోయింది. రెండు గంటల్లో, ఇద్దరి మొహాల్లో వార్ధక్యపు చిహ్నాలు పైకొచ్చాయి.

కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్లే భాస్కరం నిద్రపోయాడు.

ఓ రాత్రి వేళ చూస్తే, పద్మ భాస్కరం కాళ్ళ దగ్గర పడుకొనుంది. భాస్కరం ఆమెను పొదివి పట్టుకుని మంచం మీద పడుకోబెట్టాడు. పద్మకు వళ్ళు కాలిపోతోంది.

:: 6 ::

మోహన్‌కు ఆఫీసులో ప్రమోషనొచ్చింది. దాంతో బాధ్యతలు పెరిగాయి. ఉదయం ఆఫీసుకెడితే, రాత్రి తొమ్మిదీ, పదయ్యేది ఇంటి కొచ్చేసరికి. శలవుల్లో యింటి దగ్గర వుండేందుకు వీలుపడేది గాదు.

సుచిత్రకు నెలలు నిండుతున్న కొద్దీ గుండెల్లో గాభరా ఎక్కువవుతున్నది.

బేబీ చిన్నపిల్ల. ఏ పనీ స్వయంగా చేసుకోలేని వయస్సు. మోహన్ ఇంట్లో వుండే సమయం తక్కువ. తనకా రోజురోజుకీ నీరసం, అలసట! సుచిత్రకు అంతా అయోమయంగా వుంది పరిస్థితి.

మోహన్‌కు ప్రమోషన్ రావటం వల్ల జీతం పెరిగింది. ఇంట్లో అవసరాలకు డబ్బు ఇబ్బంది చాలావరకు తగ్గింది. ఏదన్నా క్రొత్త ఖర్చు చేయాలంటే ఇదివరకులా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునే అవసరం లేకపోయింది.

అయితే -

సుచిత్ర మనసులో ఆలోచనల సరళి రోజురోజుకూ సరిక్రొత్త రూపాన్ని సంతరించుకు పోసాగాయి. ముఖ్యంగా అద్దంలో తన మొహం చూసుకున్నప్పుడు.

మోహంలో ఉబ్బరింపు వుంది. తలలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు, వున్న జుత్తు

పూడిపోవడం, నిద్రలేమి వల్ల కళ్ల క్రింద ఉబ్బుగా తేలి, వాటి క్రింద నల్లటి వలయాలు, కాళ్ళకు నీరొచ్చి, తనాబిల్లా అయ్యాయి.

వయస్సు జారిపోతున్నదేమో? సుచిత్రకు భయం, అనుమానం!

చిన్నప్పుడు ఎన్ని కలలు కన్నది, అన్నీ కళ్ళ ముందు కదలాడాయి.

మనస్సుకు నచ్చినవాడినే చేసుకోవాలి!

ఆ వచ్చేవాడు సుందరాంగుడే కాదు, సంఘంలో మంచి హోదా, పలుకుబడీ కలిగి వుండాలి. బాగా ఆస్తిపరుడై వుండాలి. అంతేగాక, ముఖ్యంగా తనను పువ్వుల్లో పెట్టి, కంటికి రెప్పలా చూసుకుని, కోరిక మారాకు వెయ్యకముందే తెలుసుకుని, తన మెప్పు పొందాలి. వేసవిలో ఆయన చెయ్యి పట్టుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ, తియ్యటి స్మృతులు నెమరువేసుకుంటూ మెత్తటి పచ్చిక మీద నడుచుకుంటూ, సాయంకాలపు నీరెండలో కాశ్మీరపు లోయల్లో తిరగాలి! వెన్నెల రాత్రిళ్ళు ఆయన వళ్ళో తలెట్టుకుని, పిల్ల తెమ్మెరలనూ, సుదూర తీరాల్లో లీలగా వినవచ్చే షహనాయ్ నాదం వింటూ, ఆశల పందిరి ఎక్కి, ఊహాలోకాల్లో తేలిపోవాలి.

మంచు కురుస్తున్న కాలంలో, తడిసిన గులాబీలా స్వచ్ఛంగా అలంకరించుకుని, వెచ్చని ఉన్ని దుస్తులు ధరించి, మధ్యాహ్నం ఏ సముద్రతీరపు బంగళాలోనో పాప్ మ్యూజిక్ వింటూ త్రాచుపాముల్లా ఒకరి కౌగిట్లో మరొకరు పెనవేసుకుపోయి, ఒకరి గుండె చేసే చప్పుళ్ళు మరొకరు వినాలి!

ఇది కల!

ముద్దొచ్చే పిల్లలు పుట్టాలి. వాళ్ళు ఆరోగ్యంగా రాజకుమారుల్లా పెరగాలి!

సంవత్సరాలు నిమిషాల్లా గడిచిపోవాలి! అలాంటి జీవితాన్ని సుచిత్ర ఊహించుకుంది.

కానీ -

ఇదేమిటి?

మోహన్‌కు తనంటే ప్రేమ తగ్గిపోతోంది! వివాహమైన తొలిరోజుల్లో, ఆయన చూపిన వాత్సల్యం, అభిమానం కాలచక్రంలో కరిగిపోయి, ప్రస్తుతం కేవలం సానుభూతి మాత్రమే మిగిలింది. తనంటే ఆయనకు కోరిక లేదు, వున్నా, ఆ కోరికల్లో వేడి, నవ్యత లేవు. యాంత్రికం! మాట తీరు, ప్రవర్తన, అభిమానం అన్నీ నటన! విడదీసుకోలేనంతగా అవసరాలు పెరిగిపోయి, అయిష్టంగానే కలసి బ్రతుకుతున్నామేమో! - ఇది సుచిత్ర అభిప్రాయం.

ఆ రోజు, సుచిత్ర కావాలనే మేలుకొనుంది.

సాయంత్రం దాకా ఆడుకొనొచ్చిన బేబీకి వళ్ళు వెచ్చబడ్డది. అన్నం తినకుండానే పడుకొని నిద్రపోయింది. డాక్టరు దగ్గరకు తీసుకెడదామనుకుంటూనే, 'ఆయనకు మరీ ఇల్లు, ఇల్లాలు మీద శ్రద్ధ లేకుండా పోయింది. అన్నీ నేనొక్కదాన్నే చూసుకోవాలా?'

అన్న భావంతో ఊరుకుంది.

నలిగిన చీర మార్చుకోలేదు. చన్నీళ్లతో ముహం కడుక్కుని, అయిష్టంగా, కొంచెం పౌడరు వ్రాసుకుని, కిటికీ ప్రక్క కుర్చీ వేసుకుని కూర్చుంది.

వీధిలో కార్లు పోతున్నాయి. మనుషులు నడుస్తున్నారు. చిన్న చిన్న బళ్ల మీద కూరలు అమ్ముతున్నారు!

సుచిత్ర దృష్టి వీటి మీద లేదు.

బస్‌స్టాప్‌లో ఓ యువకుడు! అతని ప్రక్క పంజాబీ దుస్తుల్లో ఓ పిల్ల! వాళ్ళనే చూస్తూ వుంది సుచిత్ర!

దీపాలు వెలిగించే వేళ, ఆ పిల్ల బస్సు దిగింది. ఆ తర్వాత కొంచెం సేపటికి, అతనొచ్చాడు. అతగాడేదో చెబుతున్నాడు. ఆమె నవ్వుతూ ఉంది. ఆమె తల అడ్డంగా ఆడించింది. అతను బ్రతిమిలాడుతున్నాడు. కచోరీలు తిన్నారు. ఐస్‌క్రీం తిన్నారు. అతడు సిగరెట్ కాలుస్తూ ఏదో సీరియస్‌గా చెబుతున్నాడు. ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుతూ వింటున్నది.

సిటీ బస్సులు వచ్చి వెడుతున్నాయి. మనుషులూ వెడుతున్నారు.

కానీ వాళ్ళిద్దరూ సర్వం మరచి, ఏకాంతంగా, ఒకరినొకరు చూసుకుంటూ, ఆరాధించుకుంటూ, ప్రేమించుకుంటున్నారు!

గంటలు గడిచాయి! రోడ్డు మీద జన సంచారం తగ్గింది. మంచు కురుస్తున్నది.

అతడు ఆమె దగ్గిరగా వెళ్ళాడు. ఆమె తలొంచుకుంది. మెరుపులా ఆమెను పొదివి పట్టుకుని, బుగ్గ మీద ముద్దెట్టుకున్నాడు. ఆమె మొహంలో గులాబీలు, సంపెంగలు, మల్లెలు మొగ్గలు తొడిగాయి. అతగాడి పురుషత్వం వన్నె తేలింది.

ఇద్దరూ విడిపోయారు.

రాత్రి పది గంటలయింది.

మోహన్ రాలేదు,

ఇలా ఎదురు చూస్తూ జీవితమంతా గడపాల్సిందేనా?

సుచిత్రకు భయం వేసింది.

బేబీ నిద్రలో కలవరించింది. సుచిత్ర చప్పున వెళ్ళి బేబీ ప్రక్కన పడుకుంది.

స్త్రీకి మాతృత్వం శాపమా, వరమా?

కోరికలు తీర్చుకోవటానికి, విశృంఖలంగా జీవితపు మైదానంలో విహరించటానికి, పిల్లలు స్త్రీకి ప్రతిబంధకాలు! అదే పురుషుడికి కాదు!

ఇది ప్రకృతి ప్రసాదించిన శాసనం!

ఆలోచిస్తూ నిద్రపోయింది సుచిత్ర!

మోహన్ ఇంటికొచ్చేసరికి రాత్రి పన్నెండయింది. అఖండంలా లైటు వెలుగుతున్నది.

తలుపు దగ్గరగా వేసి వుంది.

మోహన్‌కు ఆకలి వెయ్యలేదు! బాత్‌రూంకి వెళ్ళి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని, వచ్చి ఫైలు చూస్తూ కూర్చున్నాడు. ఎంక్వయిరీ కమీషన్ రిపోర్టు, రాత్రికి పూర్తి చేస్తే, రేపు టైపు చేసి మినిష్టరుకు పంపాలి!

సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ ఓ గంట గడిపాడు చాలావరకు రిపోర్టు పూర్తి చెయ్యగలిగాడు. ప్రొద్దుట్నుంచీ తీరిక లేకుండా పనిచెయ్యటం, వేళ తప్పి భోజనం, సాయంత్రం అశోకాలో డ్రింక్స్ పార్టీ, మోహన్‌కు అలసట, ఆపైన తలనొప్పి వచ్చాయి. కనీసం చాక్లెట్ టీ అన్నా తాగుదాం అన్న ఆలోచనతో కిచెన్‌లోకి వెళ్ళాడు.

వండిన అన్నం అలాగే వుంది. పాలు అలాగే వున్నాయి. ఆశ్చర్యమేసింది. స్టౌ ముట్టించి, గదిలోకొచ్చేసరికి సుచిత్రకు మెళకువ వచ్చింది.

ఆమె కళ్ళు ఎర్రగన్నేరు పువ్వుల్లా వున్నాయి. వెలిసిన వానలా, కన్నీట చారికలు బుగ్గల మీద వున్నాయి.

"ఏం సుచీ! అలా వున్నావేం?" అనడిగాడు ఆమెను చూసి జాలిపడి.

సుచిత్ర మాట్లాడలేదు. కిచెన్‌లోకెళ్ళి, టీ కలిపి తెచ్చి, టేబుల్ మీద పెట్టి, మళ్ళీ బేబీ దగ్గర పడుకుంది ముసుగెట్టుకుని.

సుచిత్ర ప్రవర్తన గమనించిన మోహన్ జాలి పడ్డాడు.

సుచిత్ర చూలాలు. పైగా, వెనకా ముందూ తల్లీ తోడూ ఎవరూ లేరు. అలసిపోయి, తను ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు కోపమొచ్చిందేమో అనుకున్నాడు.

వెళ్ళి మంచం మీద కూర్చుని, దుప్పటి లాగేసి, "మైడియర్ సుచీ!" అని పిలిచాడు మోహన్.

సుచిత్ర భస్సుమని లేచి, "ఊ! యింకా ఏం సేవలు చెయ్యాలి తమకు!" అనంది.

మోహన్ ఆమె కళ్ళల్లోకి నవ్వుతూ చూశాడు.

ఆ చూపులోని ఆర్ద్రతకు సుచిత్ర తట్టుకోలేకపోయింది. తలొంచుకుంది. కళ్ళల్లోని వేడి తగ్గి, కన్నీరు వెల్లువలా వచ్చింది. శరీరమంతా గగుర్పొడిచింది.

మోహన్ ఆమెను పొదివి దగ్గరకు తీసుకున్నాడు. "అది కాదు సుచీ! వంట్లో బాగోలేదా! నాకు ఫోనెందుకు చెయ్యలేదు" అనడిగాడు ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

"పదిమంది మీద అజమాయిషీ నా పని. నీకు తెలుసుగా! కమీషన్ రిపోర్ట్ తయారు చెయ్యటం, దాన్ని మినిష్టరుకు పంపటం పనిలో లేటయింది. అయిపోయింది. మరో నెలలో, ఈ పనంతా అయిపోతుంది."

"అవును. మరో నెలకు అంతా అయిపోతుంది. నేను అప్పటికి కాలి భస్మమైపోతాను!"

సుచిత్ర మాటలకు మోహన్ షాక్ తిన్నాడు. సుచిత్ర మానసికంగా జబ్బు పడ్డది అని గ్రహించాడు.

"ఛ! అవేం మాటలు సుచీ! ఇంత శ్రమపడి, సంపాదిస్తున్నది ఎవరి కోసం! నీ కోసమేగా!"

"అవును. మీరు చేయించిన సొమ్ములు, కొన్న చీరలు, కట్టించిన మేడలు అన్నీ నావే! అవునుగదూ!"

మోహన్ మాట్లాడలేదు.

"ఎందుకండీ నాటకాలు! మీకు నేనంటే ప్రేమ లేదు. అథవా వున్నా, బేబీ పుట్టాక పూర్తిగా పోయింది. ఇప్పుడు నేను వంటమనిషి. మీ పిల్లలకు జీతం బత్తెం లేని నౌకరును! అంతేగా, ప్రతి ఆడదాని జీవితం ఈ భారత భూమిలో ఇంతేనండి. ఆచారాల నుంచి తప్పుకోవాలని ఆరాటపడ్డా, ఫలితం మళ్ళీ మరో బిడ్డకు తల్లిని! అయిపోయిందండీ! నూరేళ్ళ జీవితం, ముప్పయేళ్ళకే పూర్తవుతున్నది. ఈసారి పురిటి మంచం దిగేసరికి, నాలో ఏమీ వుండదు! మీకు మరీ పనికి రాకుండాపోతాను."

మోహన్‌కు ఏం చెప్పాలో, ఎలా సుచిత్రను సముదాయించాలో తెలియలేదు. ఎక్కడో చదివాడు. స్త్రీకి బిడ్డలు పుడుతున్న కొద్దీ యవ్వనం పోతున్నదని భయం పట్టుకుంటుందని! అది ఒక భయం! ఆ భయం పెద్దదై, స్త్రీని పూర్తిగా లొంగతీసుకుని ఆమెకు వార్ధక్యపు చిహ్నాలు ప్రసాదిస్తుంది! రాను రాను ధైర్యం సడలి, తన వ్యక్తిత్వం మీద, తన చుట్టూ వున్న పరిసరాల మీద ద్వేషం, కోపం బయలుదేరి, ఆమెలో సౌకుమార్యం, స్త్రీత్వం అంతరించి, హృదయకవాటాలను చించుకుపోతాయని!

ఇది సుచిత్ర పట్ల నిజమవుతున్నదా?

"సుచీ! ఇలా చూడు, నా అసమర్థత మీద నీకు కోపమా?"

సుచిత్ర మోహన్ పెదవులను చేత్తో మూసి, మనస్సుని సంభాళించుకుని, లేచి కూర్చుని, "అది గాదండీ! ఒంటరిగా వుంటే ఆలోచనలు పీక్కుతింటాయి! మంచీ చెడు మాట్లాడుకోవటానికి, దృష్టి వేరొక పని మీద లగ్నం చేయటానికి కుదరటం లేదు. నన్ను ఏకాంతంలోంచి బయటకు తీసుకువెళ్ళండి!" అనంది.

"తప్పకుండా నీకు ఉద్యోగం వెతుకుతాను!"

కుతుబ్‌మీనార్ వెనుక, తూర్పు దిక్కు పురిటి నొప్పులు పడుతున్నది. అప్పుడు సుచిత్ర మొహంలో నల్లమబ్బులు విడిపోయి, చీకటి తెర తొలగి సూర్యోదయం అయింది.

సుచిత్రకు రేపనేది తియ్యటి కల!

:: 7 ::

పద్మ పూర్తి ఆరోగ్యవంతురాలయ్యేసరికి నెల పట్టింది. ఆ నెల రోజులు భాస్కరం ఆమె ప్రక్కనే వుండి పసిపాపలా, కనురెప్పలా చూసుకున్నాడు. తీరిక దొరికినప్పుడల్లా పద్మను సినిమాలకు, నాటకాలకు, మీటింగులకు, కాలేజీ ఫంక్షన్స్‌కు తీసుకువెళ్ళి, ఆమె మనస్సుకు స్వస్థత చేకూరేలా చేశాడు.

అదీగాక, పట్నంలో భాస్కరం అద్దెకు తీసుకున్న ఇంటి ఎదురుగా సంగీతం మేష్టరు ఒకాయన వున్నాడు. ఆయన పేరు పురుషోత్తమశాస్త్రిగారు. వృద్ధుడు. పైగా అంధుడు గూడ. పిల్లలకు సంగీతపు పాఠాలు చెప్పటం, అదయ్యాక, ఏ రాత్రి వేళో, తెల్లవారు ఝామునో ఫిడేలు వాయించుకొంటూ వుండేవాడు.

పద్మ దృష్టి ఆయన వాద్యం విని, దాని మీదకు మళ్లింది.

పురుషోత్తమశాస్త్రిగారికి సంగీత శాస్త్రం పూర్తిగా వచ్చు. అయితే, ఆయనకు చేతగానిది, ఆ విద్యను రూపాయిల్లోకి మార్చుకుని సుఖపడటం! ఆయన వాయులీనంలో సౌకుమార్యం తక్కువ. శాస్త్రపాండిత్యం ఎక్కువ. హరికథలకు, కచేరీలకు ప్రక్క వాయిద్యంగా, వాయులీనాన్ని ఆయన వినియోగించడు. అది ఆయన నమ్మికకు విరుద్ధం. దానాదీనా, ఆయన భ్రష్టయోగి. సర్వచరాచర జీవకోటి నిద్రాణమై వున్నప్పుడు, ఆ నిశ్శబ్దంలోంచి ఆయన వాయులీనంలోంచి పుట్టే నాదం ఓ రకంగా కరకుగా వుంటుంది. దేనినో అన్వేషిస్తున్నట్లుగా తోస్తుంది. రాగ మాధుర్యాన్ని దాటి సరిగమల కవతల వున్న శబ్దార్థాన్ని శోధించే ప్రయత్నం, భిన్న రాగాల కలయిక వల్ల జనించే రాగపు రీతుల గురించి పరిశోధన ద్యోతకమవుతుంది.

భాస్కరం మొదట్లో విసుక్కున్నాడు ఆయన వాయిద్యం విని. కానీ పద్మ శ్రద్ధగా వింటూ, స్థాణువులా కూర్చునేది. అప్పుడు ఆమె యోగినిలా వుండేది. గుండె లోతుల్లోకి ఆ రాగవల్లరి ప్రవేశించి, శోధించి, ఆమెకు ఆనందాన్ని యిచ్చేది.

ఓ రోజు భాస్కరంతో అంది పద్మ, "ఆయన తపస్సు చూశారా?" అని

భాస్కరానికి సంగీతజ్ఞానం తక్కువ!

"మనం నిత్యం వినేదీ, ఆనందించేదీ సంగీతం కాదండి. అలల మీది నురగ మాత్రమే! దాన్ని చూసి మురిసిపోతున్నాం. ఆ నురగల క్రింద అగాధాల్లో రత్నాలున్నాయి. ఆ రత్నాల కోసం ఆ శాస్త్రిగారు శోధిస్తున్నారు."

భాస్కరానికి అర్థంగాలేదు ఆమె చెప్పింది. కానీ, పద్మ మనస్సు సంగీతానికి దాసురాలు అని తెలుసుకున్నాడు.

"పద్మా! నీకు మంచి గాత్రమిచ్చాడు గదా! దాన్ని సాన బెట్టరాదూ!"

"భలేవారే! నాది కూనిరాగాల సంగీతమండీ. పైగా, నా గొంతు శాస్త్రిగారు వింటే, నత్తగుల్ల అనంటాడు."

భాస్కరం పట్టువిడవకుండా శతపోరి, పద్మను శాస్త్రిగారి దగ్గరకు తీసుకెళ్ళాడు. పద్మ సంగీత సాధనలో పడితే, పిల్లల గొడవ, రోగం గొడవ మర్చిపోయి మామూలు మనిషవుతుందని.

శాస్త్రిగారు పద్మను పాడమన్నారు.

పద్మ ఓపట్టాన పాడలేదు. బిడియపడ్డది. పాడనని మొరాయించింది.

"చూడమ్మా. సంగీతం దైవదత్తమైన కళ. అది మన దగ్గర వున్నాక దాచి పెట్టుకోగూడదు. పదిమందికి పంచి యిచ్చి, దాన్ని ఉపయోగపడేలా చూడాలి!... పాడమ్మా" అని శాస్త్రిగారు అనునయించారు.

పద్మ జయదేవుని అష్టపది పాడింది. ఆ పాడేప్పుడు ఆమె సర్వం మరచి పోయింది. నాదబ్రహ్మ ముందు సవినయంగా నిలబడి, భక్తితో పాడినట్లు పాడింది.

భాస్కరం, ఆమె అంత శ్రద్ధగా, శ్రావ్యంగా పాడటం విని చలించి పోయాడు.

పాటయ్యాక శాస్త్రిగారు చాలాసేపు మాట్లాడలేదు. పద్మ బిక్కుబిక్కుమంటూ కూర్చుంది.

శాస్త్రిగారి కళ్ళు ఆర్ద్రమైనాయి. పాలిపోయిన పెదవులు కంపించాయి.

"ఇలా దగ్గరగా రామ్మా!" అని పద్మను పిలిచారు.

పద్మ తల మీద చెయ్యి వేసి, "చూడు తల్లీ! నీకు సంగీత సరస్వతి ప్రసాదించిన చక్కటి గాత్రముంది. వేల మందిలో ఒక్కరికి వుంటుంది ఇంతటి శ్రావ్యమైన కంఠస్వరం. దాన్ని వృధా చెయ్యకు. నిత్యమూ సాధన చెయ్యి. నీకు భగవంతుడిచ్చిన సంపదను అందరికీ పంచియిచ్చి, వాళ్ళ హృదయాల్లో సంగీతానికి చోటు కల్పించు" అన్నారు శాస్త్రిగారు.

పద్మకు ఏనుగెక్కినంత సంబరమైంది. శాస్త్రిగారి పాదాలకు నమస్కరించింది.

ఆ తర్వాత పద్మ రోజూ శాస్త్రిగారి దగ్గరకెళ్ళి, సంగీత శుశ్రూష మొదలెట్టింది. పద్మలో అనారోగ్యపు లక్షణాలు పూర్తిగా తొలగిపోయి, ఆమె మొహంలో సరిక్రొత్త కాంతి, కళ్ళల్లో వెలుగు, మాటలో, తీరులో ధైర్యం, విశ్వాసం మొలకెత్తాయి.

పద్మ పాట విని స్థానిక 'లైన్స్ క్లబ్' వారు సంగీత కచేరీ ఏర్పాటు చేశారు అనాధాశ్రమం కోసం డబ్బు ప్రోగుచేసేందుకు.

పిల్లల కోసం అన్న మాట మీద పద్మ పాడేందుకు అంగీకరించింది.

తొలిసారి వేదికెక్కి, వందలాది ప్రేక్షకుల ముందు కంఠం విప్పి పాడటం పద్మకు క్రొత్త. మొదటి పాటలో బెరుకు కనిపించింది. రెండవ పాటలో బాగా పాడుతున్నానో లేదో అన్న సందిగ్ధావస్థ కనుపించింది. రాను రాను విశ్వాసం పుంజుకుని, పద్మ పాట పాడింది.

మూడు గంటల సేపు శ్రోతలు సంగీతామృతంలో ఓలలాడారు. తల్లి ఒడిలో పిల్లలు శోలినట్లు, పైరగాలికి జొన్నచేలు వూగినట్లు, కోకిల పాడినట్లు, నెమలి ఆడినట్లు, మంద్ర మంద్రంగా పద్మ పాట, వెన్నెల వేడిలా, పసిపాప చిరునవ్వులా, సర్వజనాన్ని ఆకట్టుకుంది.

వార్తాపత్రికలన్నీ పద్మ ఫొటోలు ప్రచురించి, ఆమె గాన మాధుర్యాన్ని ప్రస్తుతిస్తూ వ్రాశాయి. సంగీత సరస్వతి అని ప్రశంసించాయి.

పద్మ విస్తుపోయింది, ప్రజలు చేసిన కరతాళ ధ్వనులకు, క్రొత్త పెళ్లి కూతురిలా

భాస్కరం కౌగిట్లో కరిగిపోయింది.

భాస్కరానికి పద్మ అంత మధురంగా, జనరంజకంగా పాడటం, సంతోషాన్ని కలుగ చేసింది. మోహన్ అన్న మాటలు గుర్తొచ్చాయి.

"మీ శ్రీమతి పాటలు బాగా పాడుతుంది. రేడియో, సినిమాల్లో ట్రై చేస్తే బావుం దేదమో?"

భాస్కరం వెంటనే, మోహన్‌కు పద్మ సాధించిన విజయాన్ని తెలియపరుస్తూ ఉత్తరం వ్రాశాడు.

పద్మకు పాట కచేరీలకు రమ్మని ఆహ్వానాలు ఎక్కువైనాయి.

పద్మ నిశ్చయించుకోలేకపోయింది. తను కచ్చేరీలు చెయ్యాలా వద్దా అన్న విష యంలో.

భాస్కరం ఆలోచన వేరుగా వుంది. అతనికి మొదటి నుంచీ పద్మ గాత్రం మీద మంచి నమ్మకం వుంది. కొంచెం శ్రద్ధ వహించితే, పద్మ గాత్రానికి విలువ వుంది. ఆదరణ లభిస్తుంది. ఎంత మేలిమి బంగారమైనా వాడకం లేకపోతే కొన్నేళ్ళకు తుప్పు పట్టవచ్చు! సాధన చేస్తూ వుంటే పద్మకు పేరు, ప్రఖ్యాతి లభిస్తాయి అన్న భావం భాస్కరానికుంది.

కానీ పద్మ ఒక కచేరీతో మళ్లీ జనం ముందుకు రానని మొరాయించింది.

భాస్కరం పట్టు విడువలేదు. పద్మలో బెరుకు పోగొట్టి, ఆమెకు ఆత్మవిశ్వాసం కలుగచెయ్యాలి అన్న సంకల్పంతో, పురుషోత్తమశాస్త్రిగారిని కలిశాడు. తన ఆలోచన వివరించాడు.

శాస్త్రిగారు అవుననలేదు. కాదనలేదు.

"నాయనా! వృద్ధుణ్ణి. సన్మానాల వల్ల నా కొరిగేదేం లేదు. ఇకపోతే, ఆర్థికంగా సహాయం చెయ్యాలని వున్నదన్నావు - మంచిదే. కానీ గర్భదరిద్రుణ్ణి. నీలాంటి వాళ్ళు ఎందరు సహాయం చేసినా నా పరిస్థితి మారదు."

"మీకు సహాయం చెయ్యటంలో నాకూ స్వార్థముంది" అన్నాడు భాస్కరం.

శాస్త్రిగారు తల వంచారు.

భాస్కరం, పద్మక్కూడ చెప్పకుండా కార్యరంగంలోకి దిగాడు. ఊళ్లో పెద్దలను కలిసి, ఓ కమిటీ ఏర్పరిచారు. తనకు తెలిసిన మిత్రులను, బంధువులను కలిసి, తను తలపెట్టిన కార్యక్రమం వివరించి వాళ్ళ సహాయం అర్థించాడు. శాస్త్రిగారి శిష్యుల, ఆప్తుల పేర్లు సంపాయించి అందరికీ ఉత్తరాలు వ్రాశాడు. పెద్దపెద్ద సంస్థలకు, ఆ సంస్థల యజమాను లకు విన్నపాలు పంపాడు. శ్రీ పురుషోత్తమశాస్త్రిగారి సన్మాన సభకు ఉదారంగా విరాళాలు పంపమని!

ఓ మంత్రిగారు సభాధ్యక్షులుగా వచ్చేందుకు అంగీకరించారు. ఓ ప్రముఖ సంగీత దర్శకుడు ముఖ్యఅతిథిగా సభకు వస్తానని తెలియజేశాడు. జిల్లా కలెక్టరు, పోలీసు

సూపర్నెంటు, మున్సిపల్ కమీషనర్ మా సహాయం వుంటుందని ధైర్యం చెప్పారు. డబ్బు కిబ్బంది లేకుండా భాస్కరం భుజం కాశారు.

ఆనాటి కార్యక్రమంలో పద్మ పాట కచేరీ వుండేలా జాగ్రత్త పడ్డాడు భాస్కరం.

"ఇదేమిటి మీకేమన్నా మతిపోయిందా! అంతమంది పెద్దవాళ్ళముందు నేను పాడటమేమిటీ!" అని నిలదీసింది భాస్కరాన్ని.

"నాదేముంది పద్మా! కమిటీ నిర్ణయం. వాళ్ళంతా నీ పాటకచేరీ వుండాలని పట్టు బట్టారు!" అని భాస్కరం తప్పించుకున్నాడు ఓసారి.

కార్యక్రమం తుదిరూపు దిద్దుకుంటుండగా, పద్మ మరోసారి భాస్కరాన్ని నిలవేసింది.

"పద్మా! పురుషోత్తమశాస్త్రిగారి లాంటి మహానుభావునికి సన్మానం చేస్తున్నప్పుడు గురుదక్షిణగా, నీ పాటకచేరీ ఏర్పాటు చేయటంలో తప్పేముంది ఆలోచించుకో! నువ్వు కాదు గూడదంటే శాస్త్రిగారు బాధపడతారు!" అన్నాడు.

పద్మ కిక కాదనే అవకాశం లేకపోయింది.

ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్సులో, మున్సిపల్ కమీషనర్ గారు పెద్ద సభావేదికను అందంగా కట్టించారు. పోలీసు సూపర్నెంటుగారు సభకు అవసరమైన కుర్చీలు, దండలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరుగారు స్వంత డబ్బుతో శాస్త్రిగారికి దుశ్శాలువా, బంగారపు ఉంగరం చేయించారు. పట్టణంలో ధనికులు, కమిటీవారు టిక్కెట్లు అమ్మి, చందాలు ప్రోగుచేసి శాస్త్రిగారికి యిచ్చే నిమిత్తం పదివేల రూపాయలు జమ చేశారు.

ఊరూ వాడా ప్రచారం జోరుగా చేయటం జరిగింది.

భాస్కరానికి చాలా సంతోషంగా వుంది. గాలిలో తేలిపోయాడు సన్మానభ దగ్గరపడ్డకొద్దీ. పద్మ తన గాత్ర మాధుర్యంతో జనాన్ని ఆకట్టుకొంటుంది. అది ఖాయం. పెద్దలు శభాష్ అంటారు. వచ్చిన సంగీత దర్శకుడు ఖచ్చితంగా పద్మ గాత్ర మాధుర్యానికి ముగ్ధుడైపోతాడు. పద్మ సుప్రసిద్ధ గాయనిగా లోకానికి వెల్లడవుతుంది... ఇది భాస్కరం ఆలోచన!

పద్మకు ఓ రకంగా భాస్కరం మీద కోపం - తనతో మాటమాత్రమన్నా చెప్పకుండా, సంప్రదించకుండా ప్రోగ్రాం ఏర్పాటు చేసినందుకు? తనేం పాడగలదు? అంతమంది ప్రముఖుల ముందు తన గాత్రం పలక్క, మూగబోతే, అభాసుపాలైతే, ఆ తర్వాత ఏమిటి తన పరిస్థితి? అసలు తనకెందుకు గాత్ర మిచ్చాడు భగవంతుడు? ఆలోచన..... ఆ ఆలోచన మధ్య గతం గుర్తుకొచ్చింది పద్మకు -

తల్లి చిన్ననాడే కరువైతే తండ్రి, తానే తల్లీ తండ్రి అయి పద్మను పెంచాడు. లాలి పాటలు పాడి, జడవేసి, పూలుపెట్టి, పుత్తడి బొమ్మలా పెంచాడు తల్లి లేదన్న కొరత లేకుండా! తనే సంస్కృతం, తెలుగు చెప్పాడు. ఆ తర్వాత రెక్కలొచ్చాయన్న ధైర్యమొచ్చాక,

తను ఆడపిల్లను పెంచలేనన్న నమ్మకం కలిగాక, తీసుకెళ్ళి శారదా నికేతనంలో చేర్చాడు. చేర్చి, "అమ్మడూ! నా బాధ్యత తీరిపోలేదమ్మా. అశక్తుడిని! అంతే. బుద్ధిగా చదువుకో బుద్ధిమంతురాలవనిపించుకో! అంతేగాదు తల్లీ. నీ తండ్రి ఇలా వదిలేసిపోతున్నాడని అనుకోకు! ప్రాణాలు ఇక్కడ వదిలి, జీవచ్ఛవంలా వెడుతున్నాను. అంతే!" అని వెళ్ళి పోయాడు. పద్మ వయస్సుకు చిన్నదైనా పరిసరాలు, తన తండ్రి పరిస్థితి గుర్తించగలిగింది. తన తండ్రి, ఎంత బాధపడి, ఈ నిర్ణయానికొచ్చాడో గూడ అర్థం చేసుకుంది. నికేతనంలో తోటి పిల్లలతో కలిసిపోయి, గతాన్ని మర్చిపోయింది క్రమేణా!

ఎన్నో వసంతాలు గడిచాయి. చిన్న పావడాతో, శారదా నికేతనంలో చేరి అదే పుట్టిల్లు అనుకుని, చదువుకుని, కుట్లు, అల్లికలు, సంగీతం నేర్చుకుంది. సదాచారం, సంస్కృతీ, సభ్యత అలవరచుకుంది. విజ్ఞత నేర్చుకుంది. లోకాచారాన్ని తెలుసుకుంది. ప్రైవేటుగా యమ్మే చదివింది.

అప్పటికి తండ్రి వృద్ధుడైనాడు. ఉద్యోగంలోంచి రిటైరయినాడు. అన్నలు, అక్కలు, పొట్ట చేత్తోపట్టుకుని, వేరు వేరు చోట్ల బ్రతుకులకు శ్రీకారం చుట్టారు అప్పటికే!

పద్మ ఏకాకి! ఆర్థికంగా వెసులుబాటు తక్కువ కావటం వల్ల, అన్నలు, అక్కలు అంతగా వచ్చేవారు గాదు. పద్మ ఊహొచ్చాక ఎక్కడకు వెళ్ళనూ లేదు. అందువల్ల, మమతానురాగాలు, బంధుత్వాలు తెలియవు. ఎండ వానలకు, గాలికీ పెరిగిన అడవి మొక్క పద్మ. స్నిగ్ధత, సౌకుమార్యం తప్ప, ఆడంబరాలేం లేవు.

పిల్ల చదువుకుందీ, అందగత్తె అన్న వాడుకవల్ల ఒకటి రెండు సంబంధాలు వచ్చాయి. అందులో భాస్కరం ఒకడు.

భాస్కరం చూడగానే, పద్మను పెళ్ళి చేసుకునేందుకు అంగీకరించాడు. తల్లి ఆమోద ముద్ర వేసింది. పద్మ జీవితంలో కొత్త మలుపు ప్రారంభమైంది. ప్రాణ ప్రదంగా చూసుకునే భర్త, కన్నకూతురిలా ఆదరించే అత్తగారు. తరగని ఆస్తి... పద్మ జీవితాన్ని చూసి, మహదా నందపడి, ఆమె తండ్రి తనువు చాలించాడు -

....ఇప్పుడీ క్రొత్త మలుపు ఎటు తీసుకుపోతుందో పద్మ ఊహించలేకపోయింది.

శాస్త్రిగారి సన్మాన సభ రోజు రానే వచ్చింది. పద్మకు బెరుగ్గా భయంగా ఉంది- 'ఎలా పాడాలి? ఏం పాడాలీ?' అని.

"పద్మా డియర్! జనం నీ పాటకచేరీ కోసం ఎదురు చూస్తున్నారు. ఎలా పాడతావో! ఇవ్వాళ అమోఘంగా పాడావో, నీ పేరు దేశంలో మార్మోగుతుంది! నా సంకల్పం నెరవేరుంది" అన్నాడు.

భాస్కరం కళ్ళల్లోని కాంక్ష, ఉద్వేగం చూసి, పద్మ చలించి పోయింది. భర్త కోరిక, ఆశయం, నెరవేర్చాలీ అని నిర్ణయించుకుని, ధైర్యాన్ని ప్రోది చేసుకుంది.

భాస్కరం కారు తెచ్చాడు. ఇద్దరూ బయలుదేరబోతుండగా. టెలిగ్రాం వచ్చింది.

"సుచిత్ర సీరియస్ - స్టార్ట్" అని!

:: 8 ::

రైలు చీకటిని దూసుకుపోతున్నది.

భాస్కరం బెర్త్ మీద వెల్లకిలా పడుకుని, అర్ధనిమీలిత నేత్రాలలో నిద్రపోతున్నాడో, మెలకువగా వున్నాడో తెలియదు.

పద్మకు నిద్ర రావడం లేదు.

సుచిత్రకు జబ్బుగా వున్నదని టెలిగ్రాం అందగానే, పద్మకు కాళ్ళల్లోకి నీరసం వచ్చేసింది. గుండె గువగువ లాడింది. పాలిపోయి స్థాణువులా నిలబడి పోయిన పద్మను చూసి, భాస్కరం బెదరిపోయాడు! పద్మకు మళ్ళీ జబ్బు చేస్తుందేమో? లేదా, మరికాసేపట్లో జరగబోయే కార్యక్రమం ఎలా జరుగుతుందీ? అన్న మీమాంస వచ్చింది భాస్కరానికి. ఏమీ తోచక ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేకపొయ్యాడు.

పద్మ మనస్సుని సంభాళించుకుంది. సుచిత్ర క్షేమంగా వుండాలని దేవుడిని ప్రార్థించింది!

"పదండి!" అని ముందుగా వెళ్ళి కారులో కూర్చుంది. భాస్కరం 'అమ్మయ్య' అని నిట్టూర్చాడు.

మున్సిపల్ గ్రౌండ్‌కు వెళ్ళేలోపల, పద్మ భాస్కరాన్ని అడిగింది, "ఢిల్లీ వెళ్ళిరావద్దూ?" అని.

"రేపు బయల్దేరి వెడదాం!"

శాస్త్రిగారి సన్మానసభ బ్రహ్మాండంగా ప్రారంభమైంది. మంత్రిగారు అన్న టైముకన్నా, రెండు గంటలు లేటుగా వచ్చారు. సభ ప్రారంభం కాగానే త్వరత్వరగా సన్మానం అయిందనిపించి, మంత్రిగారు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రతిపక్షాల వారి దురాగతాల గురించి, ఓ గంట మాట్లాడి, వేరే కార్యక్రమం వుందని వెళ్ళిపోయారు. ఆయనతోపాటు కలెక్టరు, పోలీసు సూపర్నెంటు వెళ్ళిపోయారు.

మద్రాసు నుంచి వచ్చిన సంగీత దర్శకుడు, తన జీవిత చరిత్రలోని మధురమైన ఘట్టాలు, సాధించిన విజయాలు వివరించి, ప్రేక్షకుల కోరికపై, ఆయన చిరుత ప్రాయంలో పాడిన ఓ పాట, కీచుగొంతుకతో పాడి వెళ్లిపోయాడు.

ఇదంతా అయ్యేసరికి రాత్రి పది గంటలయింది.

శాస్త్రిగారిని గురించి మాట్లాడిన వక్త లేడు. ప్రచురించిన సావనీర్ సభాముఖంగా విడుదల చేసిన ప్రముఖుడు లేడు.

రాత్రి ప్రొద్దుపోవటం వల్ల జనం చాలామంది వెళ్ళిపోయారు.

బ్రహ్మాండంగా ఏర్పాటు చేసిన పెళ్ళిపందిరి గాలివానకు చెల్లాచెదురైనట్లు, శాస్త్రిగారి సన్మానసభ ముగిసింది.

పద్మ పాటకచేరీ ప్రారంభమయ్యేసరికి, కార్యకర్తలు, పనివాళ్ళు తప్ప, సభలో ప్రేక్షకులు లేరు.

భాస్కరానికి నిరుత్సాహం కలిగింది. కట్టుకున్న ఆశాసౌధాలు పేకమేడల్లా కూలి పొయ్యాయి.

పద్మ లేని ఉత్సాహాన్ని తెచ్చుకుని, ఓ త్యాగరాయకృతి పాడింది. పాడుతూ, తన గొంతులో ఆర్ద్రత లేదనీ, జవం, జీవం కరువయ్యాయనీ గ్రహించి మరీ పేలవంగా పాడింది. భాస్కరం, తండ్రిని తగలేసివచ్చిన వాడిలా, స్టేజీలో కూర్చున్నాడు.

పద్మ గొంతు సవరించుకుని మరో పాట పాడబోయ్యేసరికి, గాలి దుమారం వచ్చి, ఆ తర్వాత కరెంటు పోయింది.

భాస్కరం ఆ రాత్రి అన్నం తినలేదు. నిద్ర పోలేదు. పద్మకు అన్నం సహించలేదు, సుచిత్ర జ్ఞాపకం వచ్చి.

"ఢిల్లీ ప్రయాణం ఏం చేశారు?"

"మనకు మనం ఎలాగూ ఉపయోగపడం! కనీసం వేరేవాళ్ళకైనా సహాయ పడదాం!" అన్నాడు భాస్కరం.

భాస్కరం మాటల్లోని అంతరార్థం పద్మకు బోధపడలేదు. భర్తని పరీక్షగా చూసింది. శిఖరం మీద నుంచి అఘాతంలో పడ్డవాడిలా వున్నాడు. ముహంలో క్రీనీడలు తచ్చాడుతున్నాయి.

"ఏమండీ! నన్ను చేసుకున్నందుకు బాధపడుతున్నారా?"

పద్మ ప్రశ్నకు భాస్కరం షాక్ తిన్నాడు.

"పద్మా! నా ప్రవర్తనలో నీ కలాంటి భావం కనిపించిందా?" అనడిగాడు.

పద్మ శరీరం పులకించింది. భాస్కరం మొహం చేతుల్లోకి తీసుకుని, పెదవులపై చుంబించి, "లేదండీ! ఎంతో పుణ్యం చేసుకుని, మీలాంటి భర్తను పొందగలిగాను. కానీ ఎందుకో నాకే అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది, యింత అదృష్టానికి నేను తగుదునా అని" అంది.

"లేదు పద్మా! అన్నీ తెలిసి, పగటి కలలు కంటాము. ఆ కలలు నిజం కావాలని ప్రయత్నించి, విఫలమైనప్పుడు నిరాశ మిగులుతుంది. నేను అంతే! నీ పాటకచేరీ మీదెన్నో ఆశలు పెట్టుకన్నా - ఫలితం చూశావుగా!"

పద్మ నవ్వింది. నవ్వి - "నాకు తెలుసండీ నా పాట, మీకే స్వంతం! ఇక ఎవ్వరికోసమూ పాడను" అంది...

రైలు పోతూనే వుంది.

భాస్కరానికి సుచిత్ర ఎలా వుందో, తాము వెళ్లేసరికి అక్కడి పరిస్థితులు ఎలా వుంటాయో అన్న ఆలోచనలో పడ్డాడు.

సుచిత్ర మోహన్‌ను చేసుకుని సుఖపడడం లేదని భాస్కరం నిశ్చయం. అలా అని సుచిత్ర ఏనాడు తన మనోభావాన్ని భాస్కరం ముందు వ్యక్తపరచలేదు. జీవితంతో సుచిత్ర రాజీ పడుతూ, తన పరాజయాన్ని, భాస్కరం ముందు కనపడకుండా జాగ్రత్త పడుతున్నది అని భాస్కరం గ్రహించాడు. ఏనాడైనా, 'బావా! నిన్ను కాదని పొరపాటుచేశాను' అని అంటుందేమోనని భాస్కరం ఆశ! ఆ ఆశ తీరుతుందా?

భాస్కరం ఆలోచిస్తున్నాడు.

సుచిత్ర, తూనీగలా అనుకున్నది అనుభవిస్తూ, గాలిలో తేలిపోయే స్వభావం గలది. అలాంటి సుచిత్రను నిజంగా పెళ్ళి చేసుకుంటే, తన పరిస్థితి ఏమిటి? ఎలా వుండేది?

భాస్కరం అంచనా వేయసాగాడు.

సుచిత్ర ఎప్పుడూ భాస్కరానికి అందనంత దూరంగా, ఎత్తుకు ఎదిగినట్లు వుండేది. అలా తోచేది భాస్కరానికి! అందుకోవాలని, నాది అన్న భావం అనుభవించాలనీ, భాస్కరానికి అంతరాంతరాలలో ఓ కోరిక వుండేది. ఆ కోరికకు ప్రత్యామ్నాయమే, పద్మను చూడగానే పెళ్లికి అంగీకరింపచేసింది.

పద్మకు కోరికలు లేవు, ఆశల మంటల అనుభూతి తెలియదు. అందుకే పద్మంటే భాస్కరానికి జాలి! అనురాగం గూడ! తన ఆశయాలకు పద్మలో రూపులు ఏర్పరచుకోవాలని ప్రయత్నించాడు. పద్మ కాదనలేదు. కానీ తను ఓటమిని పొందాడా? భాస్కరానికి జవాబు తెలియని ప్రశ్న!

ఆలోచనలతో, భాస్కరానికి తల వేడెక్కింది. ప్రక్క బెర్త్ మీద పద్మ నిశ్చలంగా పడుకుని నిద్రపోతున్నది. ఆమె కళ్ళల్లో కలలు కదలాడుతున్నాయి. పెదవులపై చిరుదరహాసం కదులుతున్నది.

భాస్కరం, ఆమె దగ్గరగా వెళ్ళి చెంపలు స్పృశించాడు. పద్మ నిద్రలోనే నవ్వింది. భాస్కరం సిగ్గుపడి వచ్చి తన బెర్తు మీద పడుకుని కళ్లు మూసుకున్నాడు బలవంతంగా!

రైలు పోతూనే వుంది.

పద్మ కెవ్వుమని కేక వేసింది. ఆ కేకకు మగతనిద్రలో వున్న భాస్కరం లేచి పద్మ దగ్గిరగా వెళ్ళి, తట్టి లేపి, "ఏం పద్మా" అనడిగాడు.

పద్మ భయం భయంగా భాస్కరం కళ్ళల్లోకి చూసి, బావురుమని ఏడ్చింది. భాస్కరం ఆమెను పొదివి పట్టుకుని దగ్గరగా కూర్చోబెట్టుకుని, "ఏం జరిగింది పద్మా" అనడిగాడు.

"సుచిత్ర చనిపోయినట్టు కల వచ్చిందండీ!" అని పొర్లి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ భాస్కరం గుండెల మీద వాలిపోయింది.

"కలలు నిజమవుతాయా నీ భ్రమగానీ?"

"తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయండీ!" అన్నది పద్మ.

"అంత భయంకరమైన కల వచ్చిందా?"

"అవునండీ!... మనం వెళ్ళేసరికి అంతా అయిపోయింది. సుచిత్ర మగపిల్ల వాడిని కని మరణించింది. బేబీ, 'అమ్మా' అని ఏడుస్తున్నది! పుట్టిన గుడ్డు పాలకోసం గుక్కపెట్టి భయంకరంగా ఏడుస్తున్నది. మోహన్ సర్వం పోగొట్టుకున్న విరాగిలా తిరుగుతున్నాడు..."

"అవు!..." భాస్కరం వినలేకపొయ్యాడు.

"నిజమండీ!.. ఢిల్లీ వెళ్లాక యిదే జరిగితే ... లాభం లేదండీ... నేను చూడలేను. చూసి బ్రతకలేను.... తిరిగి వెడదాం పదండి!" ప్రాధేయపడ్డది పద్మ.

"పద్మా, మరీ మూర్ఖంగా ప్రవర్తించకు! మరికొన్ని గంటల్లో ఢిల్లీ వెడతాం. మనం వెళ్లేసరికి సుచిత్ర క్షేమంగా ఆరోగ్యంగా వుంటుంది." అన్నాడు భాస్కరం. ఆ మాటలు అనేప్పుడు అతని కళ్ళ ముందు, ఝుమ్మని ఎగిరే తూనీగ కనపడ్డది. ఆ తూనీగ రెక్కలు తెగి, గిలగిలా కొట్టుకోవడం అతను ఊహించలేడు.

తూర్పున వెలుగు రేకులు విచ్చుకుంటున్నాయి. ఆ వెలుగు కోసం ఆత్రంగా రైలు పరిగెడుతున్నది.

పద్మ వెళ్లి చన్నీళ్ళతో మొహం కడుక్కొనొచ్చింది. వచ్చి బెర్త్ మీద నీరసంగా ముద్దగా కూర్చుండి పోయింది.

"కాఫీ త్రాగుదామా!"

"వద్దు! నాకేం త్రాగాలనిపించడం లేదు!"

"నువ్వింకా కలను మర్చిపోలేవా?"

"మర్చిపొయ్యాను, కానీ ఏం త్రాగాలనిపించడంలేదు!"

"పోనీ తినటానికి తెమ్మంటావా?"

"ఊఁ!"

భాస్కరం లేచాడు- డైనింగ్ కారు దగ్గరకు వెళ్ళేందుకు.

"ఏం తెస్తారూ?"

"బ్రెడ్!"

"వద్దు!"

"మరేం కావాలి?"

పద్మ నవ్వింది సిగ్గుపడి!

"అడిగాక కోప్పడరు గదా!"

భాస్కరం మాట్లాడలేదు.

"ఇలా రండి."

పద్మకు దగ్గరగా వెళ్ళాడు. విండోగ్లాస్ ఎత్తివేసింది పద్మ. తూర్పున పెద్ద ముత్తయిదు నుదుటి కుంకుమలా సూర్యుడు ఉదయిస్తున్నాడు. బంగారు కిరణాలు మంచుతో తడిసిన మట్టిపై పడి నవ్వుకుంటున్నాయి.

"అదిగో అది కావాలి!"

"ఏదీ?" భాస్కరం అయోమయంగా అడిగాడు.

"అంత మట్టి..." పద్మ తలొంచుకుంది.

"దేనికి."

"దేనికా.? తిందామని!" పద్మ సిగ్గుతో తలొంచుకుంది.

భాస్కరం తేరుకుని, పద్మ కళ్లల్లోకి చూడాలని ప్రయత్నించాడు. ఆమె కళ్ళు రేపటి గురించి బంగారు కలలు కంటున్నాయి.

"పద్మా! కలలు కంటున్నావా మేలుకుని?"

"లేదు!" అంది నోటితో! నిజం అంది కళ్ళతో! ఇంకా నమ్మకం కుదరకపోతే కెంపులైన బుగ్గల సాక్ష్యం అంది! మునిపంటితో క్రింద పెదవిని కసిగా కొరికి "చాల్లే అలా చూడకండి బాబూ" అంది మౌనంగా!

భాస్కరం తేల్చుకోలేకపొయ్యాడు. పద్మ పగటి కలలు కంటున్నదా లేక పీడకలను మర్చిపోయేందుకు ప్రయత్నిస్తున్నదా అని!

♦ ♦ ♦

"సుచిత్రా! ఎవరొచ్చారో చూడు?"

సుచిత్ర కనురెప్పలు భారంగా ఎత్తి పద్మను చూసింది. కనుకొలకుల్లో నీళ్ల నిలిచాయి. నోరు తెరిచి ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

"డాక్టర్లు ఏమంటున్నారు?" భాస్కరం అడిగాడు మోహన్‌ను.

"వాళ్ళు భయం లేదనే అంటారు. కానీ భాస్కరంగారూ, మెంటల్‌గా సుచిత్ర దెబ్బతింది. బ్రతికినా తిరిగి మామూలు మనిషవటం కష్టం... పైగా కవల పిల్లలు"

"అన్నగారూ! పిల్లల బాధ్యత నాది. మీరు బెంగపెట్టుకోవద్దు!" పద్మ హామీ ఇచ్చింది.

"తమ్ముళ్ళు నాక్కావాలి" అంది బేబీ.

"నువ్వూ రామ్మా మాతో" పద్మ బేబిని దగ్గరకు తీసుకుంది.

"అయినా మోహన్, ఇప్పుడీ అప్పగింతలు దేనికి? మేమిక్కడే వుంటాం. అంతగా అయితే సుచిత్రను కూడా తీసుకెడతాం!" అన్నాడు భాస్కరం.

మోహన్ క్షణం మాట్లాడలేదు. తలొంచుకున్నాడు.

"భాస్కరంగారూ! ప్లీజ్, మీరు పిల్లల్ని తీసుకువెళ్ళిపోండి! సుచిత్ర మామూలు మనిషైతే ఇద్దరం మీ వూరొస్తాం... లేకపోతే.."

"లేకపోతే..."

మోహన్ కళ్లు నీళ్ళతో తడిసిపోయాయి.

"లేకపోతే... మీకు సుచిత్రా - మోహన్ ఇద్దరూ వుండరు" - మోహన్ లేచి వెళ్ళి పొయ్యాడు.

♦